తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# ఇది ఆఫీసేనా!

**- విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసు తనిఖీలో జడ్పీ సిఇఓ ఆగ్రహం**



చిత్తూరు, జూన్ 7 ప్రభాతవార్త: ఇది ప్రభుత్వ కార్యాలయమేనా! లేక ఎద్దైనా పాత వస్తువులు నిల్వ వుంచే గోడౌనా! ఇలాగేనా ప్రభుత్వ కార్యాలయ నిర్వహణ చేసేదని జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ సగిలి షన్మోహన్ ఆదేశాల మేరకు బుధవారం జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి ఆర్‌డబ్ల్యుఎస్ డివిజన్ కార్యాలయం, విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ ఇఇ కార్యాలయంను తనిఖీ చేశారు. విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ కార్యాలయంలో విధులకు అధికారులు, సిబ్బంది ఎవ్వరు హాజరు కాకపోవడం, క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌లో పరికరాలు ఎక్కడ పడితే అక్కడ పడవేసి వుండటం, వున్న పరికరాలను భద్రపరచకపోవడం, విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ కార్యాలయ నేమ్ బోర్డు ఫ్లెక్సీ సైతం చిరిగి వుండటంపై జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ కార్యాలయం చిత్తూరులో వున్నప్పటికీ అధికారులు, సిబ్బంది మొత్తం తిరుపతిలోని విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ డిఇ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ఇక్కడికి తూతూ మంత్రంగా వచ్చి వెళ్తుండటం జడ్పీ సిఇఓ పరిశీలించారు. ఈ విషయాలను పరిశీలించిన జడ్పీ సిఇఓ సత్వరం తిరుపతి కార్యాలయం నుండి పూర్తి స్థాయి రికార్డులు, సామాగ్రిని చిత్తూరు కార్యాలయంకు తీసుకురావాలని ఆదేశించారు. అలాగే చిత్తూరు ఇఇ కార్యాలయంలో విధులు నిర్వర్తించే సిబ్బంది అందరు విధిగా విధులకు హాజరు కావాలని స్పష్టం చేశారు. అంతకు ముందు జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి ఆర్‌డబ్ల్యుఎస్ డివిజన్ కార్యాలయంలో జరుగుతున్న డ్రింకింగ్ వాటర్ ట్రాన్స్‌పర్టేషన్ బిల్స్ అప్‌లోడింగ్ ప్రక్రియను ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ శంకర్‌బాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ కార్యాలయ పరిస్థితిని కలెక్టర్ సగిలి షన్మోహన్, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్ళి విధులు నిర్లక్ష్యంగా నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకొంటామని స్పష్టం చేశారు.

# నిధులు లేక నీరసంగా సర్పంచులు

**- కష్టంగా మారిన గ్రామ పంచాయతీల పాలన**
**- పంచాయతీల్లో కష్టంగా మారిన రోజువారీ నిర్వహణ పనులు - ప్రజల్లోకి వెళ్లలేక ముఖం చాటేస్తున్న గ్రామ ప్రథమ పౌరులు**

ఓజిలి, జూన్ 7 ప్రభాతవార్త : ఆదాయ వనరులు అంతగా లేని గ్రామ పంచాయతీల పరిస్థితి మూలిగే నక్కపై తాటిపండు పడినట్లుగా తయారైంది. ఓజిలి మండలంలో ఇప్పటికే పలు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక



సతమతం అవుతుండగా, మరోపక్క కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నుంచి నిధులు దారి మళ్లడంతో సర్పంచులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో పంచాయతీల్లో ఆర్థిక సంక్షోభం నెలకొంది. ఆదాయ వనరులు అంతగా లేని చిన్న గ్రామ పంచాయతీల నిర్వహణ కత్తిమీద సాములా మారింది. పంచాయతీల్లో నిధుల కొరత వేధిస్తోంది. ఖాతాల్లో నిధులు లేకపోవడంతో రోజువారీగా పారిశుధ్య పనుల నిర్వహణ కూడా కష్టంగా మారిందని సర్పంచులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రథమ పౌరులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. బకాయిలపై ప్రశ్నిస్తే ఎక్కడ ఇబ్బందులు పెడతారో అని భయపడుతున్నారు. గ్రామంలో ప్రజలకు ఏ కష్టం వచ్చినా, నష్టం వచ్చిన సర్పంచ్ తలుపే తడతారు. ఊళ్లో ఏ పని జరగాల న్నా సర్పంచుల ద్వారానే నడుస్తాయి. మొత్తానికి ఆ ఊరికి సర్పంచే సర్వస్వం. కానీ మారిన పరిస్థితులు, రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ఇప్పుడా పదవి ముళ్ల కుర్చీలా మారుతోంది. ఆర్థిక ఇబ్బందులు ఒకవైపు, గ్రామాల్లో నాయకుల ఆధిపత్యంతో సర్పంచ్ కుర్చీకి విలువ తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షల్లో ఖర్చు చేసి ఎన్నికల్లో గెలిస్తే ఆశించిన మేర పనులు సాగక వారు దిక్కుతోచని పరిస్థితిలో పడిపోతున్నారు.

**పక్కదారి పడుతున్న ఆర్థిక సంఘం నిధులు:**

కేంద్రప్రభుత్వం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులూ పక్కదారి పడుతున్నాయి. పంచాయతీ వ్యవస్థను రాష్ట్రప్రభుత్వం నిర్వీర్యం చేస్తుండటంతో పంచాయతీలకు ఎన్నికైన సర్పంచుల రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారనుంది. ఒకప్పుడు హీరోగా తలెత్తుకుని గ్రామ పంచాయతీలలో పెత్తనం చలాయించిన సర్పంచులు నేడు జీరోలుగా మారారు. గ్రామీణ ప్రజానీకానికి ఏ పని కావాలన్నా సచివాలయాలను, వాలంటీర్లను సంప్రదిస్తే తప్ప తమ పనులు పూర్తికాని పరిస్థితి నెలకొంది. సర్పంచుల రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం పంచాయతీ సర్పంచులను పక్కనపెట్టి గ్రామ సచివాలయాలను బలోపేతం చేస్తున్న నేపథ్యంలో సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు సైతం అవసరమైన పనులన్నీ అందుతున్నాయి. తాజాగా గ్రామాల్లో భూముల రీసర్వే మొదలు, భూముల రిజిస్ట్రేషన్ వరకు సచివాలయ వ్యవస్థ పరిధిలోకి తెచ్చేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. గ్రామీణ ప్రజలెవరూ గ్రామ పంచాయతీలను, సర్పంచ్‌ను ఏ పని కోసం ఆశ్రయించాల్సిన పనిలేకుండా సచివాలయాల్లోనే పనులు పూర్తవుతుండటంతో ఉత్సవ విగ్రహాల కన్నా హీనంగా దిష్టిబొమ్మల్లా మారామని సర్పంచులు గగ్గోలు పెడుతున్నారు. కేంద్రం నుంచి రావాల్సిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులు సైతం దారి మళ్లించడంతో తమ వద్ద నిధులు లేక విధులు లేక ఏదైనా గ్రామ ప్రజల అవసరాలు, పనుల కోసం తమ వద్దకు వస్తే తాము సైతం వాలంటీర్లను, సచివాలయాన్ని ఆశ్రయించాల్సి వస్తుందని వాపోతున్నారు. న్యాయబద్ధంగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నుంచి దాఖలైన నిధులు, విధులు, అధికారాలు ఇవ్వకపోగా కేంద్రం పంచాయతీలకు జమ చేసిన ఆర్థిక సంఘం నిధులను సైతం దారి మళ్లించడం సర్పంచులకు మింగుడుపడని అంశంగా మారింది. ప్రజల మద్దతు, అభిమానాన్ని పొంది సర్పంచ్‌గా ఎన్నిక కావాలన్నా లేదా ఆ నియోజకవర్గ శాసనసభ్యునికి మద్దతు ఇచ్చి గ్రామాల్లో తమ పరపతితో ఓట్లు వేయించాల న్నా తమకు ప్రజల్లో ఏం పరపతి ఉందని, ప్రజలకు ఏమి చేయగలిగామని ప్రజలను ఓట్లు అడుగుతామనేదిగా వీరి ఆవేదనగా ఉంది. తమ విధులు, నిధులు, అధికారాల కోసం పార్టీలకు అతీతంగా పోరాటం తప్ప మరో మార్గం లేదని, తాడోపేడో తేల్చుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. నిధులు రాని పక్షంలో పార్టీలు మారే సూచనలు సైతం ఉన్నట్లు తెలుస్తోంది.

## అనుభవం లేని ఆలయ ఉద్యోగులతో...

# ఆడిట్‌లో అభ్యంతరాలు

**-బిల్లుల పని కావాలంటే ఉద్యోగులనే కాదు, ఆడిట్ సిబ్బందిని సంతృప్తి పరచాలి!**



శ్రీకాళహస్తి, జూన్ 7 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో అధికారి ఇఓ ఆదేశాల కన్నా ఆడిటర్ ఆమోదమే కీలకంగా మారింది. అన్ని సరి చేసి ఆడిట్‌కు పంపిన బిల్లులు కూడా ఆడిటింగ్ విభాగం నుంచి తిరిగి వస్తున్నాయంటే ఎవరికి అనుభవం లేదన్నది చర్చనీయాంశంగా మారింది. కోట్లలో చెల్లించే కాంట్రాక్టర్ల బిల్లులకు లేని అభ్యంతరాలు పది, పాతిక బిల్లులపై సవాలక్ష సందేహాలు, అభ్యంతరాలు వెల్లడౌతున్నాయి. సిబ్బంది అనుభరాహిత్యాన్ని ఆసరా చేసుకుని ప్రతి ఫైల్‌కి ఆడిట్ విభాగా సిబ్బంది ఎంతో కొంత ముట్టచెప్పాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. ఆడిటర్ అభ్యంతరాలకు, సిబ్బంది పని తీరుకు సమన్వయం కుదరటం లేదు. వస్తువులు సరఫరాల చేసి బిల్లుల కోసం కాంట్రాక్టర్ల అవస్థలో ఆలయ సిబ్బందితో పాటుగా ఆడిట్ సిబ్బంది కూడా వేధిస్తున్నట్లు సమాచారం. ఎదో ఒక వంకతో కొర్రీలు వేయడం, ఎంతో ఒకంత ముట్టచేపితే ఫైల్ సరిచేయడం ఆలయ ఆడిట్ విభాగం తంతుగా మారింది. ఇది గత కాలంలో ఒక మోస్తరగా వున్నా, ఇప్పుడు ఇది తారాస్థాయికి చేరినట్లు చిన్న స్థాయి కాంట్రాక్టర్ల అంటున్నారు.

**అనుభవం లేని ఉద్యోగులు...**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో అధికారుల నిర్ణయాలు ఆడిటింగ్‌లో చతికిల పడుతున్నాయి. అధికారుల నిర్ణయాలపై కూడా ఆడిటర్ చెక్ పెడుతున్నారంటే ఇక్కడి ఆలయంలో పని చేస్తున్న ఉద్యోగుల అనుభవరాహిత్యాన్ని బహిర్గతం చేస్తున్నాయి. గతంలో మ్యానువల్‌గా ఫైళ్లు రాసే వారు. ప్రస్తుతం అన్ని అన్ లైన్‌చేసిన దేవాదాయశాఖ సిబ్బందికి శిక్షణ ఇవ్వక కూర్చొబెట్టడంతో ఫైలింగ్ పరిస్థితి ఆగమ్యగోచరంగా మారుతుంది. దాంతో దేవస్థానంకు వస్తువులు సరఫరా చేసిన వారు కార్యాలయం చుట్టూ, ఆడిటర్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొందరు బాధితులుగా మారి, నెలల తరబడి ప్రదక్షిణలు చేస్తూ ఇక ప్రయోజనం లేదని బిల్లులు వదులుకునే పరిస్థితి వచ్చింది. దేవాదాయశాఖ ఆన్‌లైన్ విధానంను రూపొందించినపుడు ఇక్కడ పని చేస్తున్న సిబ్బందికి తప్పని సరిగా శిక్షణ ఇవ్వాల్సి ఉంది. కానీ అలా చేయకపోవడంతో, సిబ్బందికి అనుభవం లేక ఫైలింగ్ తప్పుల తడకగా రూపొందించి పొందుపరుస్తున్నారు. దాంతో ఆడిటింగ్ అభ్యంతరాలతో బిల్లులు మూల పడుతున్నాయి.

**సమన్వయ లోపం...**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో సిబ్బందికి అనుభవ రాహిత్యం. ఇక అనుభవం కల్గిన ఆడిటర్ సిబ్బందితో సమన్వయంతో పని చేయాల్సి ఉంది. కానీ రెండు శాఖల మధ్య సమన్వయ లోపం. బిల్లు పోతే అభ్యంరం ఏమిటనేది చూపాల్సిన బాధ్యత తరువాత ఆ ఫైల్ తెప్పించుకోవాల్సిన ఆడిటింగ్ విభాగం తిరస్కరించి మూల పడేస్తున్నారు. దాంతో లబ్దిదారులు తిప్పలు పడుతున్నారు. ఇక ఫైలు పంపిన ఉద్యోగి కూడా ఆడిటర్ ఏం అభ్యంతరం చెబుతున్నారో తెలుసుకొని పరిష్కరించాల్సి ఉంటుంది. కానీ ఆ దిశగా పని చేయటం లేదు. సిబ్బంది తమ పని అయిపోతే, తాము ఫైల్ పంపేస్తే ఇక తమ పని అయిపోయిందనిపించుకుంటున్నారు. ఆడిటర్ ఏం అభ్యంతరం రాసారు? తాము ఏం పొందుపరచాలనే అంశాన్ని పరిగణలోకి తీసుకోవటం లేదు. ముఖ్యంగా సూపరింటెండెంట్లు, ఎఇఓల స్థాయిలో లాగిన్ కావటం లేదు. ఇక అనుభవం లేని ఉద్యోగులు సమాధానం చెప్పడం లేదు. దాంతో దేవస్థానం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న వారు విసిగి వేసారుతున్నారు. ప్రతి సీటు వద్ద తమ డిమాండ్లను సంతృప్తి పరచినా పట్టించుకునే దిక్కులేదు. ఇప్పటికైనా అధికారులు ఈ లోపాన్ని సరిదిద్దాల్సి ఉంది.

**రూ.కోట్ల బిల్లులు పరుగులు...**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో కాంట్రాక్టర్లకు సంబంధించిన కోట్ల రూపాలయ బిల్లులు పరుగులు తీస్తూ చెల్లింపులు జరుగుతున్నాయి. అయితే చిన్న చిన్నవస్తువులు సరఫరాలు చేసిన వారి బిల్లులకు సవాలక్ష ఆడిట్ అభ్యంతరాలుతో సిబ్బంది తీరు అభాసుపాలౌతుంది.

## నేటి నుంచి శ్రీ చెంగాళమ్మ తిరునాళ్లు



విద్యుద్దీపాలంకరణలో ఆలయం

సూళ్లూరుపేట, జూన్ 7 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలో శ్రీచెంగాళమాతా పరమేశ్వరిదేవి తిరునాళ్లు గురువారం బలిహరణతో అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవస్థానాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించడంతో పాటు భారీ ఆర్చిలు, విద్యుద్దీప ఆర్చిలు ప్రధాన కూడళ్లలో అమర్చారు. పట్టణంలో పలుచోట్ల విద్యుద్దీపాలంకరణలు చేసి తిరునాళ్ల వాతావరణాన్ని తీసుకొచ్చారు. శుక్రవారం సుడిమాను ఉత్సవంతో ఈ కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అదేరోజున అమ్మణ్ణి గ్రామోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. 10వ తేదీన సుడిమాను ఉత్సవం, మహిషాసురమర్ధిని కార్యక్రమం ఉంటుంది. ప్రధాన ఘట్టమైన తెప్పోత్సవం 12వ తేదీన కాళంగి నదిలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున బాణాసంచా కాల్చే ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా మంచినీరు, పారిశుధ్యం తదితర ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమిటీలను నియమించారు. వీటితో పాటు దేవస్థానంలో భక్తుల రద్దీని తట్టుకునే విధంగా ప్రత్యేక క్యూలైను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతిరోజు దేవస్థానం మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలను ఈ నెల 14వ తేదీ వరకు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రముఖ సినీనటులు, జబర్దస్త్ టీమ్‌తో పాటు స్థానిక కళాకారులు భాగస్వాములు కానున్నారు. ప్రముఖ సినీనటి హనీరోజ్, సురభి, ఇతర నటులు ప్రత్యేక ఆకర్షణ కానున్నారు. వీరితో పాటు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, పలువురు ప్రముఖులు హాజరవుతున్నారు. సినీ పాటకచ్చేరితో పాటు టిటిడి వారిచే భక్తిపాటల కచ్చేరిలు ఏర్పాటు చేశారు. వారంరోజుల పాటు భక్తులకు ఆహ్లాదంతో పాటు భక్తిభావం కలిగేలా కార్యక్రమా లను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో ఆలయ ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి నేతృత్వంలో కార్యనిర్వహణ అధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు.

## గోవిందనామా స్మరణతో మార్మోగిన రథోత్సవం



నారాయణవనం, జూన్ 7 ప్రభాతవార్త : ప్రసిద్ధి పుణ్యక్షేత్రంగా బాసిల్లుతున్న నారాయణవనంలోని పద్మావతీదేవి సమేత కల్యాణ వే ంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబందించి కల్యాణ వేంకటేశ్వరుడు ఎనిమిదవ రోజు బుధవారం ఉదయం శ్రీవారి రథాన్ని అధిరోహించి నగరవీధుల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తుల గోవిందనామా స్మరణతో శ్రీవారి మహారథం ముందుకు సాగి ంది. మొక్కుబడి కలిగిన భక్తులు శ్రీవారి రథంపై ఉప్పు, మిరియాలను చల్లి మొక్కును తీర్చుకున్నారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరునికి అంగరంగ వైభవంగా ఆర్జితం కల్యాణోత్సవం నిర్వహించారు. ఆర్జితం కల్యాణోత్సవంలో వేలాదిమంది భక్తులు పాల్గొని తరించారు. అనంతరం రాత్రి అశ్వవాహనంపై అధిరోహించి మేళతాళాలు నడుమ భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. రథోత్సవంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎంపిపి పి.దివాకర్‌రెడ్డి, సర్పంచ్ కెజి శారదమ్మ గణేషన్ తదితరులు పాల్గొన్నారు. స్వామి వారి దర్శనం చేసుకున్న తర్వాత ప్రసాదాన్ని అందించారు. డిప్యూటీఇఓ నాగరత్న, ఎఇఓ మోహన్, సూపర్‌టెండెంట్ ఏకాంబరం, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ భరత్, సివిల్ ఇంజనీర్ గురుప్రసాద్, నారాయణవనం సర్పంచ్ కెజి శారదమ్మ గణేషన్, అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, నరసింహరాఘువ భట్టాచార్య, శ్రీనివాస భట్టాచార్య, వివిధ శాఖలకు చెందిన టిటిడి అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుడి



అప్పలాయగుంటలో వైభవంగా రథోత్సవం

వడమాలపేట, జూన్ 7 ప్రభాతవార్త: అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారికి బుధవారం రథోత్సవం వైభవంగా జరిగింది. ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో బాగంగా ఉదయం 6.25 గంటలకు స్వామివారు రథారోహణం చేశారు. ఉదయం 7.25 నుంచి 9 గంటల వరకు స్వామివారు నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ ఆలయ మాడవీధుల్లో కోలాహలంగా రథోత్సవం జరిగింది. భక్తులు వీధుల్లో రథాన్ని లాగుతూ తమ భక్తిని చాటుకున్నారు. మాడవీధుల్లో విహరించిన స్వామివారికి భక్తులు హారతులు పడుతూ రథంపై ఉప్పు, మిరియాలు చల్లారు. 9 గంటలకు తిరిగి వాహన మండపం చేరుకున్న శ్రీనివాసునికి, ఉభయ దేవేరులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు నిర్వహించిన ఊంజల్‌సేవలో శ్రీవారు చిద్విలాసంగా ఉయాల ఊగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 6.30 గంటలకు వాహన మండపం చేరుకున్న శ్రీవారు అలంకరించిన అశ్వ వాహనాన్ని అధిరోహించి మాడవీధుల్లో విహరించగా భక్తులు అడుగడుగునా స్వామివారికి కర్పూర హారతులు, నారికేళలు సమర్పిస్తూ భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి, అధికారి శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్య కుమారాచార్యులు, రమణాచార్యులు, వేదపండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

**న నేడు చక్రస్నానం:**

శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు గురువారం ఉదయం చక్రస్నానం వైభవంగా జరగనుంది. ఇందులో భాగంగా ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారికి, చక్రత్తాళ్వార్ వారికి వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం ఆలయం ఎదురుగా పుష్కరిణిలో శాస్త్రోక్తంగా చక్రస్నానంజరుగుతుందని టీటీడీ అధికారులు తెలిపారు.



అశ్వ వాహనంపై విహరించిన వేంకటేశ్వరుడు

## స్పష్టతతో...టెన్షన్ వీడింది!

**-2024లోనే సార్వత్రిక ఎన్నికలు**



ప్రభాతవార్త-తిరుపతి: రాష్ట్రంలో అధికార వైసిపి ప్రభుత్వం నిర్ణీతగడువుకే (2024లో) ఎన్నికలకు వెళ్తామని స్పష్టత నివ్వడంతో ఇప్పటి వరకు అన్ని పార్టీల్లోనూ నెలకొన్న టెన్షన్ వీడిపోయింది. ముందస్తు ఎన్నికలొస్తాయంటూ నిన్నటి వరకు హడావిడి చేసిన ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నాయకుల్లోనూ కొంత స్తబ్ధత వీడింది. ఎప్పుడు ఎన్నికలు వస్తాయో...ఎవరికి టిక్కెట్లు ఖరారుచేస్తారో ననేది అయోమయంగా మారింది. ఈ నేపథ్యంలో బుధవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ కీలక సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంత్రులకు ఎన్నికలపై ప్రకటన చేయడంతో అందరిలోనూ ఉత్కంఠ వీడింది. ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం నాయకులు ముందస్తు ఎన్నికలకు సిద్ధమేనంటూ చేస్తూ వచ్చిన హడావిడికి బ్రేక్ పడింది. ప్రజాభిప్రాయం మేరకే టిక్కెట్లు ఖరారుచేస్తానని ఇప్పటికే టిడిపి అధినేత చంద్రబాబునాయుడు చేసిన ప్రకటన కూడా టిడిపి నేతల్లో కొంత మింగుడు పడని విషయంగా పరిణమించింది. ఇదే సమయంలో బుధవారం మంగళగిరి లోని పార్టీ కార్యాలయంలో చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని 26 జిల్లాలకు సంబంధించి 2024 ఎన్నికల్లో ఏ అసెంబ్లీ స్థానంనుంచి ఎవరిని పోటీకి దింపాలనేది ఖరారుచేశారు. ఇదే ప్రకటనతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను కూడా దాదాపు ఎంపిక చేసి వారిని పోటీకి సిద్ధం కావాలని చెప్పేశారనేది సమాచారం. తాజా సమాచారం మేరకు ఉమ్మడి చిత్తూరుజిల్లాలో చిత్తూరు నియోజకవర్గం టిక్కెట్‌ను బలిజ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్‌కు, పలమనేరు స్థానంలో మాజీమంత్రి ఎన్. అమరనాధరెడ్డిని, కుప్పంలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడే పోటీ చేస్తున్నారు. ఇక మదనపల్లి నియోజకవర్గంలో దొమ్మలపాటి రమేష్‌కు 2024 ఎన్నికల్లో టిక్కెట్ దాదాపు ఖరారు చేశారనేది విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇక ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థుల పేర్లును సూచన ప్రాయంగా ప్రకటించినా అవేమీ నిజం కాదనేది చంద్రబాబే వెల్లడించేశారు. దీంతో రానున్న ఎన్నికల్లో అటు చిత్తూరు జిల్లా ఇటు తిరుపతి జిల్లాలోని నియోజకవర్గాల్లో ఎవరికి టిక్కెట్లు కేటాయిస్తారనేది ఆ పార్టీ నేతల్లోనే అయోమయం నెలకొంది. ఇదిలా ఉండగా అధికార వైసిపిలో కూడా ఉమ్మడి చిత్తూరుజిల్లాలో దాదాపు 13 స్థానాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరి పనితీరు, ప్రజాభిప్రాయం మేరకు రానున్న ఎన్నికల్లో టిక్కెట్లు ఖరారుచేస్తానని సిఎం జగన్ ఇప్పటికే పలు దఫాలుగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎన్నికలకు ఇంకా మరో తొమ్మిది నెలల సమయం ఉండటంతో ప్రజాక్షేత్రంలో మరింత గట్టిగా పనిచేయాలని, ఎమ్మెల్యేలుగా బలోపేతం కావాలని సూచించారు. అయితే ఇప్పటి పరిస్థితుల్లో ముగ్గురు నలుగురికి తప్ప మిగిలిన వారికి సిట్టింగ్ ఎమ్మెల్యేలకు తిరిగి టిక్కెట్లు వస్తాయనే నమ్మకం ఆ పార్టీ నేతలకే లేదు. మరీ ఎన్నికలకు ఇంకా సమయం ఉండటంతో ఎవరి భవిష్యత్తు ఏమనేది డిసెంబర్ ఆఖరుకు తేలిపోతుందనే సందిగ్ధత వీడిపోనుంది. ఇప్పటికైతే ముందస్తు ఎన్నికలకు వెళ్ళేది లేదని తేలిపోవడంతో అన్ని పార్టీల్లోనూ కొంత ఊరటకలిగింది.

## 27 ఎర్రచందనం దుంగలు... మోటారు సైకిళ్లు స్వాధీనం



ఎర్రచందనం దుంగలు నిందితులను అరెస్టు చేసి చూపుతున్న దృశ్యం

తిరుపతి కార్పొరేషన్, జూన్ 7, ప్రభాతవార్త : గూడూరు, కేవీబీ పురం ప్రాంతాల్లో రెండు కేసుల్లో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్న 9 మంది స్మగ్లర్లను అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి 27 ఎర్రచందనం దుంగలు, ఐదు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్సు డీఎస్పీ మురళీధర్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు రేంజి డిఐజీ సెంథిల్ కుమార్ ఆదేశాల మేరకు మురళీధర్ ఆధ్వర్యంలో ఆర్ఐ చిరంజీవికి చెందిన ఆర్‌ఎస్ఐ నరేష్ టీమ్ నాయుడు పేట రేంజ్ గూడూరు ఫారెస్ట్ బీట్ పరిధిలోని కొండగుట్ట నిషేధిత అటవీ ప్రాంతంలో రంగపరెడ్డిచేను వద్ద బుధవారం ఉదయం మూడు మోటారు సైకిళ్లలో కొంత మంది వ్యక్తులు కనిపించారు. వారికి చుట్టుముట్టగా, పారిపోయొందుకు ప్రయత్నించారు. దీంతో వారిని పట్టుకుని విచారించగా రవాణాకు సిద్ధంగా ఉంచబడిన 16 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వారిని గూడూరు మండలానికి చెందిన పిగిలం నవీన్ (27), పిగిలం మనోజ్ రావు (30) పాలిచెర్ల బాలాజీ (24), నూర్ భాషా శకుర్ (27), మావాడూరి శ్రీహరి (28) వెంకటగిరి మండలానికి చెందిన పుట్టా సుబ్రమణ్యం (43)లుగా గుర్తించి అరెస్టు చేశారు. వారి ఉపయోగించిన మూడు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్‌ఎస్ఐ విశ్వనాధ్‌కు చెందిన టీమ్ పుత్తూరు రేంజి కేవీబీపురం మండలం వగత్తూరు ఫారెస్టు బీటు పరిధిలో మారప్పగారి కండ్రిగ గ్రామంలోని అటవీ ప్రాంతంలో రెండు మోటారు సైకిళ్లపై కొందరు వ్యక్తులు టాస్క్ ఫోర్సు సిబ్బందిని చూసి పారిపోయే ప్రయత్నం చేసారు. వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా వారిలో ముగ్గురిని పట్టుకోగలగారు, వారిని పిచ్చాటూరు మండలం వి. అజిత్ (26) నాగలాపురం మండలం కె. రమేష్(44), తమిళనాడు తిరువళ్లూరు జిల్లా పొన్నేరి తాలుకాకు చెందిన ఎం. హరిదాస్ (41)లుగా గుర్తించారు. వీరి నుంచి 11 ఎర్రచందనం దుంగలతో పాటు రెండు మోటారు సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పి మురళీధర్ తెలిపారు. 27 ఎర్రచందనం దుంగలు రూ. 20 లక్షల మేర విలువ ఉంటుందని అంచనా వేసినట్లు చెప్పారు. ఈ రెండు కేసులను టాస్క్ ఫోర్సు పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయగా సిఐ బాలకృష్ణ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో ద్రౌపది ఆలయంలో యజ్ఞపూజ

**వెదురుకుప్పం, జూన్ 7 ప్రభాతవార్త :**



మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయంలో అత్యంత భక్తిశ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించారు. వేద పండితులు వేద మంత్రాల నడుమ వివిధ అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అమ్మవారిని, పంచపాండవుల మూలవిరాట్, ఉత్సవ మూర్తులను పట్టు బట్టలు, పూలు, ఆభారణాలతో అలంకరించి పూజలు చే శారు. ఈ కార్యక్రమంకు ఉభయదాతలుగా ఎంపీటీసీ సభ్యులు పుత్తూరు రాధిక పురంధర్ రెడ్డి, పెరు మాళ్ళపల్లె ఎంపీటీసీ సభ్యులు తోకల మురళి రెడ్డి, పుత్తూరు భాస్కర్ రెడ్డిధనకోటిలు వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బండి నాగరాణి, ఆలయ ధర్మకర్త ఉమాపతి రెడ్డి, కార్యనిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మైనార్టీ సమావేశంలో పాల్గొన్న షాకిరాలీ

**శ్రీకాళహస్తి, జూన్ 7 ప్రభాతవార్త :**



తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ముస్లిం మైనార్టీ విభాగ సమావేశంలో శ్రీకాళహస్తికి చెందిన తెలుగుదేశంపార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి షాకిరాలీ పాల్గొన్నారు. బుధవారం మంగళగిరిలో రాష్ట్ర మైనార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో మైనార్టీ ముస్లింలపై జరుగుతున్న దాడులపైన, మైనార్టీల సమస్యలపైన సుదీర్ఘంగా చర్చించారు. వెనుకబడిన మైనార్టీలకు ఏవిధంగా సహాయపడాలి, ఆర్థిక, మరియు విద్యా, వ్యాపార పరంగా మైనార్టీలకు తెలుగుదేశంపార్టీ తరపున సహాయ పడగలం అన్న పలు అజెండా అంశాలపై చర్చించారు. సమావేశంలో రాష్ట్ర మైనార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి షాకిరాలీ మాట్లాడుతూ మైనార్టీలకు ఉచిత విద్య, రెడిడెన్స్ స్కూల్స్,మరియు ఎటువంటి షరతులు లేకుండా దుల్హన్ పథకం పేదవారికి అందించాలని, అదేవిధంగా మైనార్టీ కార్పొరేషన్ ద్వారా యువకులకు సబ్సిడీ లోన్లు ఇవ్వాలని తెలిపారు. రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు మౌలానా ముష్తక్ అహ్మద్, మాజీ శాసన సభ మండలి చైర్మన్ షరీఫ్అహ్మద్, మరియు రాష్ట్ర, జిల్లా మైనార్టీ ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

## అలరించిన అర్జున తపస్సు

**వెదురుకుప్పం, జూన్ 7 ప్రభాతవార్త :**



చవటగుంట మహాభారత ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన అర్జున తపస్సు కార్యక్రమం పలువురిని అలరించింది. మహాభారత ఇతి హాస ఘట్టంలో పసుపద అస్త్రం సంపాదించడంకు అర్జునుడు పరమ శివుని మెప్పు పొందడంకు శివునితో తపడి ఆయన ఆశీస్సు లు పొంది పసుపద అస్త్రం సంపాదించడంజరుగుతుందని ప్రతీతి. ఆ ఘట్టంను శ్రీవెంకటేశ్వర నాట్య కళామండలి కళాకారులు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఆలయంలోని తపస్సు ప్రాంగణంకు అర్జున వేషాదారి చేరకుని శివునితో తలపడు సన్నివేశంను అద్భుతంగా ప్రదర్శించారు. అనంతరం అర్జున వేషాదారి తపస్సు అధిరోహిస్తూ ప్రతి మెట్టుకు పాటలు పద్యాలు అలపిస్తూ తపస్సు ఎక్కడం జరిగింది. తపస్సు పైకి చేరుకుని తానతో పాటు తీసుకువెళ్ళిన విబూదిపండ్లు, నిమ్మపండ్లు జనం పైకి విసరడంతో వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. ఈ కార్యక్ర మంలో ఆలయ ధర్మకర్త ఉమాపతి రెడ్డి, కార్యనిర్వాహ సభ్యులు కృష్ణా రెడ్డి,ఆంజనేయులు రెడ్డి, కొండా రెడ్డి, రామయ్య, ఆనంద రెడ్డి, జయరాం, జీవన్ బాబు, భక్తులు తదితరు లు పాల్గొన్నారు.

## జగనన్నను మళ్లీ ఆదరించాలి : ఎమ్మెల్యే

**కోట, జూన్ 7 ప్రభాతవార్త :**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ప్రజలు మళ్లీ ఆదరించాలని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు కోరారు. బుధవారం కోటలోని వైద్యవిధాన పరిషత్ సామాజిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ఆయన పరిశీలించారు. నూతనంగా ఇక్కడ కోటి 93 లక్షల రూపాయలతో ఆధునిక భవనాన్ని నిర్మిస్తున్న ట్లు తెలిపారు. నాడు-నేడు కింద ఈ ఆసుపత్రి భవనాన్ని మంజూరు చేయడం జరిగిందన్నారు. పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తామని తెలిపారు. ఈ సామాజిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని త్వరలోనే మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేతుల మీదుగా కోట ప్రజలకు అంకితం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, తిరుపతి పార్లమెంటు మైనార్టీ సెల్ నాయకులు మొబిన్‌బాషా, యరటపల్లి మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## పెన్షనర్లకు పెండింగ్ డిఆర్,పిఆర్‌సి బకాయిలు చెల్లించండి

**పలమనేరు, జూన్ 7 ప్రభాతవార్త:**



రాష్ట్రంలో ఉన్న 3 లక్షల మంది పెన్షనర్లకు ప్రభుత్వం చెల్లించవలసిన డి.ఆర్ బకాయిలు,పి.ఆర్.సి బకాయిలను వెంటనే చెల్లించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గురురాజారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.బుధవారం స్థానిక ఎస్టీఓ కార్యాలయం వద్ద పెండింగ్ బకాయిల కోసం దర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 2018 నుండి జూలై 2021 వరకు చెల్లించవలసిన డి.ఆర్,2020 నుండి డిసెంబర్ 2021 వరకు చెల్లించవలసిన పిఆర్‌సి బకాయిలు దశలవారిగా రాబోవు 4 సంవత్సరాలలో చెల్లింస్తామన్న ప్రభుత్వ నిర్ణయంపై పెన్షనర్లు విషయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి విశాల హృదయంతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.బకాయిల చెల్లింపుకు మరో 4 సంవత్సరాలు వేచి ఉండాల్సి వస్తే లక్షలాది మంది పెన్షనర్లు బకాయిలు తీసుకోకుండానే మరణించే అవకాశముందని ఆవేదన వ్యక్తం చేశారు.మెడికల్ రీయంబర్స్‌మెంట్ ద్వారా లక్షలాది రూపాయలు ఖర్చు చేసి కార్పోరేట్ ఆసుపత్రిలో ప్రాణాలు తాత్కాలికంగా రక్షించుకుని ఆ ఖర్చు చేసిన నగదు కోసం ప్రభుత్వనికి ప్రతిపాదనలుపంపి ఏడాది కావస్తున్న ఇప్పటి వరకు మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి ఇప్పటికైన స్పందించి పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో క్రిష్ణమూర్తి,గౌస్,పివి సుబ్రమణ్యం,గురుస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వేతనాల కోసం కుప్పంలో ద్రవిడ ఉద్యోగుల నిరసన ర్యాలీ



**కుప్పం, జూన్ 7 ప్రభాతవార్త :**

వేతనాల కోసం సమ్మె చేస్తున్న ద్రవిడ వర్సిటీ తాత్కాలిక ఉద్యో గులు బుధవారం రోడ్డెక్కారు. కుప్పం పట్టణంలోని పాతపేట చెరువు కట్టనుంచి బస్టాండు వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. తమకు పెంచిన నాలుగు నెలవేతనాలు చెల్లించా లని 12నెలల అరియర్లు అందిం చాలని డిమాండ్ చేశారు. సిఎఫ్ఎంఎస్ ద్వారా వేతనాలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనంతరం బస్టాండు వద్దగల డా॥ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం అంబేద్కర్ వి గ్రహానికి వినతిపత్రం అందించారు. పాతికేళ్లగా వర్సిటీలో పనిచేస్తున్న తమ సమస్యలను పట్టించుకునే వారు కరువయ్యారని వాపోయారు. గురువారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపడ్తామని పేర్కొన్నారు.

## రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి!

**కుప్పం, జూన్ 7 ప్రభాతవార్త :**

కుప్పం రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడికి సుమారు యాభై ఏళ్ల వయసు ఉంటుందని మృతదేహం పరిశీలిస్తే తమిళనాడుకు చెందిన వ్యక్తిగా ప్రాథమికంగా గుర్తించామన్నారు. మృతదేహంను పంచనామాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కడపకు భారీగా తరలిన తెలుగు తమ్ముళ్లు

**కుప్పం, జూన్ 7 ప్రభాతవార్త :**

కుప్పంకు చెందిన తెలుగుదేశం పార్టీ శ్రేణులు బుధవారం భారీ సంఖ్యలో కడపకు తరలివెళ్ళారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కడపలో బుధవారం చేపట్టిన మిషన్ రాయలసీమ డిక్లరేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు దేశం నేతలు నాలుగు మండలాల నుంచి పెద్ద ఎత్తున కడపకు వెళ్లి కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శాంతియుత సమాజ ఆవిష్కరణ లక్ష్యంగా విధులు

**పాలసముద్రం, జూన్ 7 ప్రభాతవార్త:**

శాంతియుత సమాజ ఆవిష్కరణ లక్ష్యంగా శాంతి సేవా సంఘం కమిటీ సభ్యులు విధులు నిర్వర్తించాలని ఎస్ఐ సురేష్ పిలుపునిచ్చారు. పాలసముద్రం పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఎస్ఐ సురేష్ శాంతి సేవా సంఘం కమిటీ సభ్యులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ సమాజంలోని బడుగు, బలహీన వర్గాలు, పేదల సమస్యలను శాంతి సేవా సంఘం కమిటీ సభ్యులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించాలన్నారు. శాంతి సేవా సంఘం కార్యకర్తల జాబితాలో అహింసా వాదులు వుండేలా కమిటీ ఏర్పాటు చేసుకోవాలన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## నేడు సదుం,చౌడేపల్లె,పుంగనూరుల్లో మంత్రి పర్యటన

**సదుం, జూన్7 ప్రభాతవార్త :**

రాష్ట్ర విద్యుత్ పర్యావరణ అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం పుంగనూరు నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు వైకాపా రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. ఉదయం సదుంలో వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల భవనానికి శంకుస్థాపన చేస్తారని అనంతరం సదుంలో సోమల మార్గంలో కొత్తగా నిరి ్మంచిన వంతెన విద్యుద్దీకరణ పనులకుప్రారంభోత్సవం చేస్తారని చెప్పారు. అదేవిధంగా చౌడేపల్లెలో కొత్తగా నిర్మించిన పోలీసుస్టేషన్ భవనాన్ని ప్రారంభిస్తారని అనంతరం లద్దిగం పీహెచ్‌సీ ప్రారంభం,ఆర్వో ప్లాంటు ప్రారంభం చేస్తారన్నారు. అక్కడి నుంచి పుంగనూరు మండలంలో పర్యటిస్తారని పుంగనూరులో కొత్తగా నిర్మించిన మండల కార్యాలయాల సముదాయం ప్రారంభిస్తారన్నారు. అనంతరం మార్కెట్ యార్డు వద్ద అర్బన్ హెల్త్ క్లినిక్ ప్రారంభించి 33 కేవీ లైన్ షిఫ్టింగ్ పనులకు భూమి పూజ చేస్తారని చెప్పారు. ఆతర్వాత తూర్పు మొగసాలలో అర్బన్‌హెల్త్ సెంటర్ ప్రారంభించి అక్కడి నుంచి చదళ్లలో 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి,కాటిపేరిలో పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తారని పేర్కొన్నారు. అందరు వైకాపా నాయకులు, కార్యకర్తలు అందరు పాల్గొనాలన్నారు.

## కాణిపాకంలో జలప్రసాద కేంద్రాల ప్రారంభం

**కాణిపాకం, జూన్ 7 ప్రభాతవార్త:**



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకసవ్వమివారి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన జలప్రసాద కేంద్రాలను బుధవారం స్థానిక ఎమ్మెల్యే బాబు ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన దివీస్ లేబొరేటరీస్ వారు దేవస్థానం వద్ద 64.50 లక్షల రూపాయల వ్యయంతో నాలుగు ప్రాంతాలలో శ్రీసిద్ది వినాయక జలప్రసాద కేంద్రాలు (మినరల్ వాటర్ ప్లాంట్)లను ఏర్పాటు చేశారు. వీటిని స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబు బుధవారం ఉదయం ప్రారంభించారు. ఈసందర్భంగా అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం ప్లాంట్‌లను ప్రారంభించి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈసందర్భంగా దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కలి ్పంచి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు, ఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు రవీంద్రబాబు, ఎస్వీ.కృష్ణారెడ్డి, దివీస్‌లేబొరేటరీస్‌శ్రీనివాసులు,ఇంజనీరింగ్‌సిబ్బంది,అర్చకులు,వేదపండితులుపాల్గొన్నారు.

## గణనాథుని సన్నిధిలో ఎమ్మెల్యే

**కాణిపాకం, జూన్ 7 ప్రభాతవార్త:**



పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు బుధవారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే వెంట ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు, స్థానిక నాయకులు, ఉభయదారులు తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం మున్సిపల్ రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి



**- మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్**

**కుప్పం, జూన్ 7 ప్రభాతవార్త :**

కుప్పం మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులును కోరారు. బుధవారం రెవెన్యూ సదస్సుకు హాజరైన జెసిని కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ మర్యాదపూర్వకంగా కలసి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా మున్సిపల్ పరిధిలో నెలకొన్న వివిధ సమస్యలను జాయింట్ కలెక్టర్ దృష్టికి ఛైర్మన్ తీసుకెళ్లారు. జెసి మాట్లాడుతూ సమస్యల పరిష్కారంకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మోహన్‌రాం, రాజ్‌కుమార్, సలహాకమిటీ సభ్యురాలు బృందమాల పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## రైతులు తప్పని సరిగా ఈకెవైసి చేసుకోవాలి : ఎడిఎ

**వెంకటగిరి, జూన్ 7 ప్రభాతవార్త :**

రైతులు తప్పని సరిగా ఈ కె వైసి చేసుకోవాలని ఎడిఎ ఎం నాగారు ్జన సాగర్ తెలిపారు. బుధవారం నాడు ఎడిఎ కార్యాలయంలో వైఎస్ఆర్ రైతు భరోసా, ఆర్ఓఎఫ్ఆర్ భూములకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ కెవైసిపి చేసుకోక పోతే రైతులకు ప్రభుత్వ పథకాలు అందవని తెలిపారు.భూసార పరిక్షల గురించి ఎఒ సుజాత వివరించారు.రైతులు భూసారాని బట్టిపంటల సాగు,ఎరువులు వాడ వచ్చునని తెలిపారు.136 మంది రైతు భరోసాకు అర్హులయ్యారని ఇంకాను ఎవరైన ఉంటే దరఖాస్తులు చేసుకోవాలని ఐటిడిఎ ఉద్యావన శాఖ ఎడి అనురాధ,ఎపిఓ సుదాకర్ తెలిపారు.

## విఆర్ఓఇపై చుట్టి గ్రామస్తులు దాడి!

**బాలాయపల్లి, జూన్ 7 ప్రభాతవార్త :**

మండలంలోని చుట్టి గ్రామానికి చెందిన ప్రభుత్వ భూమి ఆక్రమించారని సమాచారం అందంతో బుధవారం నాడు విఆర్ఓ మేకలయ్య భూమిని పరిశీలిస్తుండగా గ్రామస్తులు దాడి చేశారు.గత మూడు రోజుల క్రితం 10 ఎకరాల భూమిలో కొందరు గ్రామస్తులు నిమ్మ చెట్లను నాటి ఉండగా తాసిల్దార్ ఆదేశం మేరకు వాటిని తొలగించామన్నారు. అయితే మరలా మొక్కలు నాటారని ఫిర్యాదు అందడంతో విఆర్ఓ పరిశీలించేందుకు వెళ్లగా గ్రామస్థులు దాడి చేశారని తెలిపారు. విషమై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## ఎమ్మెల్యే గారూ.. మాకు న్యాయం చేయండి

**కోట, జూన్ 7 ప్రభాతవార్త :**



కోటలోని ఆర్ఆర్ థియేటర్ సమీపంలో రోడ్డు మార్జిన్ పక్కన గత 40 సంవత్సరాలుగా జీవిస్తున్నామని పేద ప్రజలు గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద రావుకు తెలియజేశారు. బుధవారం కోటలో జరుగుతున్న రోడ్డు పను లను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా తమను అధికారులు ఖాళీ చేయాలని చెప్పున్నా రని, ఎక్కడికి వెళ్లి జీవించగలమని వాపోయా రు. ప్రత్నామ్యాయ స్థలాలు చూపితే ఖాళీ చేస్తామన్నారు. దీంతో ఎమ్మెల్యే వరప్రసాదరావు ప్రత్యామ్నాయ స్థలాలు చూపాలని అధికారులను ఆదేశించారు.ఆయనవెంట నల్లపరెడ్డివినోద్‌కుమార్‌రెడ్డి,మొబిన్‌బాషా, రఘురామిరెడ్డి తదితరులు ఉన్నారు.

## సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆది పురుష్ పోస్టర్ వార్తలను నమ్మరాదు

**తిరుపతి క్రైం, జూన్ 7, ప్రభాతవార్త**



ఆది పురుష్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరర్ కావడం తిరుపతి పోలీ సుల దృష్టికి వచ్చింది. ఈ చిత్రం యొక్క ప్రొడక్షన్, డిస్ట్రిబ్యూషన్ యూ నిట్లు పోస్టర్‌లోని విషయాలను తిరస్కరించాయి. ఈ లాంటి వార్తలను ప్రజల ఎవ్వరు నమ్మవద్దని ఇందులో ఎలాంటి నిజాలు లేవని తిరుపతి జిల్లా పరమేశ్వర రెడ్డి విజ్ఞప్తి చేసారు. అందువల్ల ఈ పోస్టర్‌ను ఎవరు వైరల్ చేయవద్దని, ఇలాంటి ప్రచారానికి పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్పి పరమేశ్వర రెడ్డి హెచ్చరించారు.

## తిరుపతి జిల్లాలో

### తొలి విడత సిఐల బదిలీ(ల)లు! -సర్కిళ్ళు మార్చారంతే!! -ఇక్కడిక్కడే సర్దుబాటు పోస్టింగ్‌లు

**ప్రభాతవార్త-తిరుపతి:**

తిరుపతి జిల్లా ఏర్పాటైన తరువాత తొలిసారిగా దాదాపు నాలుగేళ్ళకుపైగా ఒకే సర్కిల్‌లో పదవీకాలం పూర్తిచేసుకున్న సిఐల బదిలీలు ఆసక్తికరంగా మారాయి. తిరుపతి సబ్‌డివిజన్‌లోనే వివిధ సర్కిళ్ళలో విధులు నిర్వహిస్తున్న సిఐలను పక్కపక్క సర్కిళ్ళకు మార్పుచేయడంపై పోలీసువర్గాల్లో చర్చనీయాం శమైంది. 2019 వ సంవత్సరంలో నూతన ప్రభుత్వం ఏర్పాటైన తొలిరోజుల్లోనే వివిధ చోట్ల నుంచి తిరుపతి డివిజన్‌లోని పలు పోలీసుస్టేషన్‌లకు బదిలీపై వచ్చారు. దాదాపు నాలుగేళ్ళు పూర్తికావచ్చిన సిఐలను తాజాగా బుధవారం బదిలీ చేస్తూఅనంతపురం రేంజ్ డిఐజి ఆర్ఎన్ అమ్మిరెడ్డి ఉత్వర్వులు జారీచేశారు.వీరందరినీఇక్కడేపలుసర్కిళ్ళకుసర్దుబాటుచేశారనే విమర్శలు పోలీసువర్గాల్లో వినిపిస్తోంది.కాగా మరికొందరు సిఐలు,ఎస్ఐలు కూడా మరో వారంరోజుల్లో బదిలీ కానున్నారనేది తెలుస్తోంది.

**తిరుపతి డివిజన్‌లోబదిలీ అయిన సిఐల వివరాలు....**

| ప్రస్తుతం పనిచేస్తున్న సర్కిల్ | బదిలీ అయిన సర్కిల్ |
|---|---|
| బివి శివప్రసాద్‌రెడ్డి(తిరుపతి ఈస్టు) | తిరుచానూరు |
| వి.సుబ్రమణ్యంరెడ్డి (తిరుచానూరు) | ఎంఆర్‌పల్లి |
| **(తిరుపతి రూరల్ )** | |
| పి.సురేంద్రనాథ్‌రెడ్డి(ఎంఆర్‌పల్లి) | విఆర్-ఎస్‌పి |
| జి.ఓబులేసు (చంద్రగిరి) | పాకాల |
| కె.రాజశేఖర్ (పాకాల) | చంద్రగిరి |

## గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి!

**నాయుడుపేట, జూన్ 7 ప్రభాతవార్త :**



గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతిచెందిన సంఘటన నాయుడుపేట మండలం అన్నమేడు వద్ద జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. చుట్టుపక్కల ప్రాంతాల్లో అడవుల నుంచి దాహార్తికి జింకలు రహదారిపైకి చేరుకుంటున్నాయి. ఈ క్రమంలో మూడు జింకలు నరసారెడ్డికండ్రిగ వద్ద రహదారి దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఒక జింక మృతిచెందగా మిగిలిన రెండు జింకలు అక్కడి నుంచి అడవుల్లోకి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు జింక కళేబరాన్ని బిరదవాడ వద్ద గల అటవీశాఖ నర్సరీ సమీపంలో పశువైద్యులు వేణుగోపాల్‌రెడ్డిచే పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు.

## అగ్నికి ఆహుతైన గడ్డి వాము

**చిల్లకూరు, జూన్ 7 ప్రభాతవార్త :**



మండలంలోని వల్లిపేడు గ్రామంలో పోలిబోయిన చెంచయ్య అనే రైతు వెయ్యి మోపులు గడ్డి వామును ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం నిప్పంటించారు. ఈ ప్రమాదంలో గడ్డి వాము మొత్తం అగ్నికి ఆహుతైయింది. ఈ ప్రమాదం జరిగిన వెంటనే కోట అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేపట్టారు. ఈ ప్రమాదంలో ఆ రైతుకు కనీసం 50 వేల రూపాయిలు చేసే గడ్డి అగ్నికి ఆహుతైయిందని రైతు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరైయ్యారు. ఊరు మధ్యలో గడ్డి వాము అగ్నికి ఆహుతి అవ్వడంతో ఒక్కసారిగా ప్రజలందరూ ఆందోళనకు గురైయ్యారు.

## విఆర్ఓలకు అండగా నిలిచిన ఆర్డీఓ

**గూడూరు, జూన్ 7 ప్రభాతవార్త :**



బాలాయపల్లి మండలం రామాపురం గ్రామ రెవెన్యూ అధికారిపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఆర్డీఓ కిరణ్‌కుమార్‌కు చిల్లకూరు తహశీల్దార్, గూడూరు డివిజన్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు గిద్దలూరు రమణయ్య, ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసులు, గ్రామ రెవెన్యూ అధికారులు వినతిపత్రం అందజేశారు. బాలాయపల్లి మండలం రామాపురం గ్రామ సర్వే నంబర్ 177 స్థలం పశువుల మేతపోరంబోకుగా ఉండటంతో ఆ భూమిని కొంతమంది ఆక్రమించారని పలుమార్లు గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. బాలాయపల్లి తహశీల్దార్ ఆదేశాలతో గ్రామ రెవెన్యూ అధికారి మేకాలయ్య అక్రమణకు గురైన భూమిని పరిశీలించడానికి వెళ్లగా, ఆక్రమణదారులు దాడి చేయడం దారుణమని ఆర్డీఓకు వివరించారు. ఆర్డీఓ స్పందిస్తూ అధికారులను ఇబ్బంది పెట్టినా, బెదిరింపులకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తప్పవని, క్రిమినల్ కేసులు పెడతామని గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ స్పష్టం చేశారు. వెంటనే డీఎస్పీకి ఫోన్‌లో ఈ విషయమై వివరించి క్రిమినల్ కేసు నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ అధికారులపై దౌర్జన్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ కిరణ్‌కుమార్ అన్నారు. గ్రామ రెవెన్యూ అధికారికి ఆర్డీఓ కిరణ్‌కుమార్ అండగా నిలిచారు. ఇలాంటివి మళ్లీ పునరావృతం కాకుండా కఠినంగా శిక్షించాలని విఆర్ఓలు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి!

**గూడూరు, జూన్ 7 ప్రభాతవార్త :**

గూడూరు మండలం నెల్లటూరు గ్రామ ఎస్టీ కాలనీ సమలపంలో ఉన్న చెరువులో ప్రమాదవశాత్తు తుపాకుల చిన్నయ్య అనే గిరిజనుడు పడి మృతి చెందాడు. ఆర్డీఓ కిరణ్‌కుమార్ ఉన్నతాధికారులతో మాట్లాడి ఎస్‌డిఆర్ఎఫ్ టీమ్‌ను పిలిపించి మృతదేహాన్ని వెలికి తీయించారు. వివరాలిలా ఉన్నాయి. గూడూరు మండలం నెల్లటూరు గ్రామానికి చెందిన తుపాకుల చిన్నయ్య అనే వ్యక్తి మద్యం మత్తులో మంగళవారం సాయంత్రం చెరువులోకి దిగగా, లోతు ఎక్కువగా ఉండటంతో మృతిచెందాడు. పోలీసులు గజ ఈతగాళ్లను పిలిపించి మృతదేహం కోసం గాలించగా కనిపించలేదు. ఆర్డీఓ కిరణ్‌కుమార్ ఉన్నతాధికారులతో మాట్లాడి వెంకటగిరిలో ఉన్న ఎస్‌డిఆర్ఎఫ్ టీమ్‌ను పిలిపించి మృతదేహాన్ని బుధవారం వెలికి తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## తిరునాళ్ల ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే సంజీవయ్య

**సూళ్లూరుపేట, జూన్ 7 ప్రభాతవార్త**



సూళ్లూరుపేటలో తిరునాళ్లకు సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఆలయ ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, ఎంపిపి అల్లూరు అనిల్‌రెడ్డిలు బుధవారం పరిశీలించారు. దేవస్థానంలో జరుగుతున్న ఏర్పాట్లతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు వేదిక కానున్న మైదానంలో పనులను పరిశీలించి సూచనలిచ్చారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే సంజీవయ్య సూచించారు. అమ్మణ్ణి తిరునాళ్లను ఇంటి పండుగలా భావించి ప్రతి ఒక్కరూ విజయవంతం చేసేందుకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఐదేళ్లకోసారి జరిగే అమ్మణ్ణి తిరునాళ్ల పండుగను ఘనంగా నిర్వహించి మంచిపేరు తీసుకొచ్చేందుకు కృషి చేయాలని సంజీవయ్య కోరారు. ఈ కార్యక్రమంలో కళత్తూరు శేఖర్‌రెడ్డి, జెట్టి వేణు, మీజూరు రామకృష్ణారెడ్డి, అలవల సురేష్, అయితా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## గిట్టుబాటు ధర కోసం మామిడి రైతులు ఎదురుచూపు

### ప్రభుత్వం రూ. 19 ప్రకటన...ఆచరణలో రూ. 10 మాత్రమే

**విజయపురం, జూన్ 6 ప్రభాతవార్త :**



మండలంలోని మామిడి రైతులు దళారులు, వ్యాపారుల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారు. ఏడాది పాటు శ్రమ కోర్చి పండించిన పంటను ఒక కేజీ కేవలం పది రూపాయలకే కొనుగోలు చేస్తూ వ్యాపారులు రైతులను కొల్లగొడుతున్నారు. అదే సమయంలో జ్యూస్ ఫ్యాక్టరీలకు 20 నుంచి 25 రూపాయలకు వరకూ విక్రయిస్తూ అధిక లాభాలు గడిస్తున్నారు. జిల్లా కలెక్టర్ షన్మోహన్ స్వయంగా రైతుల నుంచి ఒక కేజీ మామిడికాయలు రూ. 19 రూపాయలకు కొనుగోలు చేయాలని ప్రకటించారు. వ్యాపారులు, రైతులతో నిర్వహించిన సమవేశంలో ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పినా వ్యాపారులు రైతులకు కనీస ధర ఇవ్వడం లేదు. మండలంలో 1600 ఎకరాల్లో మామిడి సాగు జరుగుతోంది. బంగినపల్లి, తోతాపురి, సిందూర, ఖాదర్, ఖాలేపాడు వంటి రకాలు పండుతున్నాయి. వీటిలో ఎక్కువగా తోతాపురి 1000 ఎకరాల్లో సాగవుతోంది. ఉద్యానవన శాఖాధికారులు 19 రూపాయల కంటే తక్కువ ధరకు కొంటే చర్యలు తప్పవని హెచ్చరించినా జ్యూస్ ఫ్యాక్టరీ యజమానులు సిండికేట్ అయిపోయి మామిడి రైతులను ముంచేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. కేవలం కేజీ మామిడికాయలు పది రూపాయలకు కొనుగోలు చేస్తూ ప్రశ్నిస్తే త్వరలో మరో రూపాయి తగ్గుతుందని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ధర లభిస్తే పెద్దగా లాభాలు రాకపోయినా అప్పుల పాలు కాకుండా బయటపడతామనిరైతులుచెబుతున్నారు.ప్రభుత్వంస్పందించి గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు.

## స్వర్ణరథంపై విహరించిన గణనాథుడు

**కాణిపాకం, జూన్ 7 ప్రభాతవార్త:**

కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో బుధవారం రాత్రి సిద్ధి బుద్ధి సమేతుడైన గణనాథుడు స్వర్ణరథంపై ఆలయ మాడా వీధుల్లో విహరిస్తూ భక్తులను అభయ హస్తమిచ్చారు. ప్రతి నెలా పౌర్ణమి అనంతరం సంకట హర చతుర్థి రోజున స్వామివారికి స్వర్ణరథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ఆలయంలో స్వామివారికి ఉదయం, సాయంత్రం వేళల్లో సంకటహర చతుర్థి వ్రతంను ఘనంగా నిర్వహించారు. అలాగే సాయంత్రం స్వామివారికి స్వర్ణ రథోత్సవం అత్యంత కన్నుల పండువగా నిర్వహించారు. ఈసందర్భంగా సిద్ది, బుద్ది సమేత గణనాథుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి సర్వాంగ సుందర ంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం మిరమిట్లు గొలుపుతున ్న స్వర్ణరథంపై వుంచి మరోమారు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల గణేష్ నామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ మాడా వీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు, ఏఈఓ రవీంద్రబాబు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు, అర్చకులు, వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా వేదాం గంగమ్మ జాతర

శ్రీకాళహస్తిరూరల్,జూన్ 7 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తి మండలంలో బుధవారం శ్రీకాళహస్తికి సమీపంలోని వేదాం గ్రామంలో గంగమ్మ జాతర అంగరంగ వైభవంగా జరిగింది.శ్రీకాళహస్తికి ఏడు కిలో మీటర్ల దూరంలో దక్షిణ కాళిమాత ఆలయానికి సమీపంలో వెలసిన గ్రామంలో ఆదివారం భారీ ఎత్తున పొంగళ్ళు నిర్వహించారు. సిపాయి సుబ్రమణ్యంను మాజీ వైస్ ఎంపిపి దొరైరాజురెడ్డి తరఫున స్వాగతం పలికారు.అమ్మవారి ఆశీస్సులతో స్వాగతం పలికి సత్కరించారు.ఈ కార్యక్రమాల్లో రత్నం రెడ్డి,పెరుమాళ్‌రెడ్డి, తొట్టంబేడు మాజీ జడ్‌పిటిసి వెంకటాచలం తదితరులు స్వాగతం పలికారు.

## మధన్నకు అండగా నిలుద్దాం:

శ్రీకాళహస్తి,జూన్7 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రజల హృదయాల్లో గూడుకట్టుకున్న యువ నాయకుడు మధన్నకు రాష్ట్రంలో నిరుపేదల సంక్షేమమే పరమావధిగా పరిపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి మైనారిటీ ముస్లింలు అండగా నిలుద్దామని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మెన్ ఖాదర్ బాషా పిలుపు మేరకు తిరుపతి జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మెన్ షేక్ సిరాజ్‌బాషా ప్రచారం ప్రారంభించారు. బుధవారం సిరాజ్‌బాషా 'హర్ దిల్‌మే వైయస్‌ఆర్-హమ్ సబ్‌జగన్‌కే సాథ్' కార్యక్రమాలను మసీదుల్లో శ్రీకారం చుట్టారు. మస్‌జిద్‌యే యూసుఫ్‌లో మసీదు కమిటి ముతవల్లి షానవాజ్, కార్యదర్శి షబ్బీర్ ఇమాం సాహెబ్ హాఫీజే ఖుర్ ఆన్ నసీం అఖ్తర్‌లను కోరారు. ఈ మేరకు ముస్లిం సోదరులను చైతన్యవంతుల్ని చేయాలని కోరారు.ఈ మేరకు వక్ఫ్‌బోర్డు ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరింపజేసారు.

## కాలభైరవునికి ప్రత్యేక అభిషేకాలు

శ్రీకాళహస్తి,జూన్ 7 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలోని ఈశాన్య మూల వెలసిన కాలభైరవుని ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు అలంకారాలు నిర్వహించారు. .ఈ కార్యక్రమాలను ఆలయ ప్రదానార్చకులు కరుణాకర్ గురుకుల్ పర్యవేక్షణలో అభిషేకాలను నిర్వహించారు.అభిషేకాల అనంతరం ఆఖండ హారతిని అందించారు. పూజల సందర్భంగా ఆలయాన్ని చక్కగా అలంకరించారు.

## యజమానిని కోల్పోయిన కుటుంబాలను ఆదుకుంటున్న సిపాయి

ఏర్పేడు(శ్రీకాళహస్తిరూరల్),జూన్ 7ప్రభాతవార్త :



శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలకు ఎంతో కాలంగా అండగా ఉంటున్న రష్ అధినేత డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఎంఎల్‌సి అయిన తరువాత కూడా చేయూత అందిస్తున్నారు. గతంలో వైద్యపరంగా ఆదుకున్న ఆయన నేడు సామాజిక పరంగా ఆదుకుంటున్నారు. అధికార వైకాపా ఎంఎల్‌సిగా ఎన్నికైన తరువాత ఆయన విన్నూత్న రీతిలో తమ కులానికి సంబందించిన కుటుంబాలను ఆదుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పేడు మండలం దుర్గిపేరి గ్రామంలో బుధవారం ఆయన ఇంటి యజమానిని కోల్పోయిన కుటుంబానికి 'సిపాయి భరోసా' కార్యక్రమాల్లో భాగంగా నెలకు సరిపడ్డ నిత్యావసర సరకులను అందజేసారు. గ్రామంలో దొడ్డి కృష్ణారెడ్డి ఇటీవల మృతి చెందారు.ఈ కుటుంబానికి సంబంధించిన పేదరికాన్ని సిపాయికి తెలిసిన వెంటనే స్పందించారు. 40 రకాల నిత్యావసర సరకుల్ని అందించారు.,, సర్పంచ్ మునిరామిరెడ్డి, వెంకటస్వామి, సునీల్, బత్తెమ్మ, పద్మమ్మ, మాయావతి, జ్ఞానమ్మ, రామలక్ష్మీ, రాజేశ్వరి శ్రీనివాసులు, భాను, మునీశ్వర్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆంకాళమ్మఆలయానికి సహాయం:

ఏర్పేడు(శ్రీకాళహస్తిరూరల్,),జూన్ 7 ప్రభాతవార్త :



ఏర్పేడు మండలం చిందేపల్లి గ్రామం ఆధ్యాత్మిక చింతనలో నిమగ్నమౌతుంది. గతంలో బ్రహ్మాండమైన శ్రీరామమందిరాన్ని గ్రామస్థులు కలసి నిర్మించుకున్నారు. ప్రస్తుతం అంకాళమ్మ ఆలయాన్ని నిర్మిస్తున్నారు.ఈ ఆలయానికి కనమలంబెట్టి శ్రీనివాసులు వారి కుటుంబసభ్యుల పేర అంకాళమ్మ దేవాలయం నిర్మాణానికి రూ.10,116లు విరాళం నిర్మాణ నిర్వాహాకులకు అందించారు.

## శివయ్య సేవలో నటి దివి

శ్రీకాళహస్తి,జూన్ 7 ప్రభాతవార్త :



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయానికి ప్రముఖ నటి దివి విచ్చేసారు.ఆమెకు పరిపాలనా భవనం వద్ద ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సారధ్యంలో స్వాగతం చెప్పారు.స్వామి అమ్మవార్లను దర్శించుకున్న దివికి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

## శారీరక వ్యాయామం సంపూర్ణ ఆరోగ్యం



స్వమాక్స్ సిఈఓ సంగీతం విశ్వనాథ్
చంద్రగిరి, జూన్ 7 ప్రభాతవార్త:

శారీరక వ్యాయామం సంపూర్ణ ఆరోగ్య సూత్రమని స్వమాక్స్ సిఈఓ సంగీతం విశ్వనాథ్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య భద్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధనిక ప్రపంచంలో ఆరోగ్యవంతమైన జీవితానికి శారీరక వ్యాయామం దోహదపడగలదని అన్నారు. మానవ మనుగడను సైతం విస్మరించి విపరీతపు ఆహారపు అలవాట్లతో భౌతిక దేహానికి అనేక కష్టాలను కొని తెచ్చుకుంటున్నారని అన్నారు. దాదాపు 7 దశాబ్దాలుగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రజల జీవన నాణ్యత ప్రమాణాలను పెంచడానికి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వమాక్స్ ఉద్యోగులు పి.సుబ్రమణ్యం, ఎస్.రామనాథరెడ్డి, టి.జయరామిరెడ్డి, పూర్ణచంద్ర (నాబార్డ్), ప్రసాద్ లోకేష్, మునిరాజా, తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి కుటుంబాలకు చెవిరెడ్డి పెళ్ళి కానుక

చంద్రగిరి, జూన్ 7 ప్రభాతవార్త:



పేదింటి కుటుంబాలకు ఎంఎల్ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పెళ్ళి కానుకలు పంపినట్లు ఎంపిటిసి బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి తెలిపారు. స్థానిక పాతపేట సప్తగిరి కాలనీకి చెందిన రేకల లక్ష్మీదేవి, రేకల గోవింద రావు దంపతుల ద్వితీయ కుమారుడు రేకల అనిల్‌కుమార్ వివాహం చేయ నిశ్చయించారు. ఈ నేపద్యంలో వీరికి ఎంఎల్ఏ పెళ్ళి కానుకలు పంపినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి వైసిపి డివిజన్ కన్వీనర్ కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, వార్డు సభ్యుడు శివ, నాయకులు హరి, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా రిజిస్ట్రసార్‌కు దస్తావేజు లేఖరుల ఘన సన్మానం

చంద్రగిరి, జూన్ 7 ప్రభాతవార్త:



స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ తిరుపతి జిల్లా రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన జి.శ్రీరామ్‌కుమార్‌ను బుధవారం తిరుపతి జిల్లా దస్తావేజు లేఖరుల జేపిసి అధ్యక్షుడు సి.ఎం.కేశవులు (డాక్యుమెంట్ రైటర్ బుజ్జి) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ క్రమంలోనే దస్తావేజు లేఖరుల గౌరవ అధ్యక్షుడు వజ్రాల దామోదరం, కోశాధికారి ఎన్.దేవరాజులు రెడ్డి, డాక్యుమెంట్ రైటర్లు వాసు, మాధవ, బావజాన్, స్టాంప్ వెండర్ ఈ.రామమూర్తి ఉమ్మడిగా రిజిస్ట్రార్‌ను దుశ్శాలువ అలంకరించి, ఫలాలు అందజేసి సన్మానించినట్లు తెలిపారు.

## విద్యార్థి దశ నుంచే ధర్మం పై అవగాహన కల్పించాలి

-టిటిడి డిఈవో డాక్టర్ భాస్కర్ రెడ్డి
తిరుపతి(విద్య), జూన్ 7 ప్రభాతవార్త :



పిల్లలకు విద్యార్థి దశ నుంచే ధర్మాచరణ, హింధూ ధర్మం గురించి అవగాహన కల్పించాలని టిటిడి విద్యాశాఖాధికారి డాక్టర్ భాస్కర్ రెడ్డి అన్నారు. అన్నారు. శ్వేతలో బుధవారం ఆరు నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న టిటిడి ఉద్యోగుల పిల్లలకు సనాతన హింధూ ధర్మంపై ఒక రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా డిఈవో డాక్టర్ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి ఏ విధంగా బ్రతకాలి అని చేప్పెదే ధర్మమన్నారు. పిల్లలకు ధర్మ మార్గంలో పయనించడం, ధర్మాన్ని ఆచరించడం లాంటి విషయాలపై అవగాహన కల్పించడం మంచి కార్యక్రమమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో మంచి ఆలోచనలు కలిగించి వారు సమాజానికి ఉపయోగపడే విధంగా తయారు చేస్తాయని చెప్పారు. శ్వేత డైరెక్టర్ ప్రశాంతి పర్యవేక్షలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు శ్రీ వెంకటేశ్వర దివ్య వైభవం, సనాతన ధర్మం పరిచయం, నైతికత – ప్రవర్తన, హింధూ ధర్మంలో మంచి అలవాట్లు –శాస్త్రీయత, వ్యక్తిత్వ వికాసం – భగవద్గీత, యోగ – ధ్యానం అంశాలపై ఆయా రంగాల్లోని ప్రముఖులు శిక్షణ ఇచ్చారు.

## విద్యార్థులకు బహుమతులు పంపిణీ

నగరి, జూన్ 7 ప్రభాతవార్త:



సాప్ సమ్మర్ క్యాంప్ 2023 మే 24 నుంచి జూన్ 7 వరకు నగరి కేవీకేలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు మంత్రి రోజా సోదరుడు వై.రాంప్రసాద్‌రెడ్డి బహుమతులు అందజేశారు. నగరి కేవీకే మైదానంలో క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, చెస్ క్రీడలను వేసవి శిబిరం ఏర్పాటు చేసి పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన అండర్-10 విభాగంలో విన్నర్స్‌గా నగరి ఏ టీం, 18 రన్నర్స్‌గా నగరి బీ టీం, బెస్ట్ బ్యాడ్మింటన్ అఖిలేష్‌కి, బెస్ట్ బౌలర్ రోహన్‌కి బహుమతులు అందజేశారు. అలాగే అండర్ విభాగంలో గోదావరి-11, కృష్ణ-11 టీములు కంబైన్డ్ విన్నర్స్‌గా నిలిచారు. ఈ అండర్-14 విభాగంలో బెస్ట్ బ్యాడ్మింటన్‌గా బెస్ట్ బౌలర్‌గా దేవేందర్‌లకు టోపీలను అందజేశారు. అలాగే అండర్-16 విభాగంలో యమునా లెవెల్స్, గంగా లెవెల్స్ పోటీ పడగా వీరిలో విన్నర్స్‌గా ట్రోఫీగా యమునా లెవెల్స్ రన్నర్స్‌గా ట్రోఫీగా గంగా లెవెల్స్ బహుమతులు అందుకున్నారు. అలాగే బెస్ట్ బౌలర్‌గా రాహుల్ కుమార్ బెస్ట్ బ్యాడ్మింటన్‌గా సిద్ధులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నగరి మున్సిపల్‌చైర్మన్, కమిషనర్, వైస్ చైర్మన్‌లు, వైస్ ఎంపీపీలు, బోర్డు డైరెక్టర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ముఖ్యనాయకులు, క్రీడాకారులు, కోచ్ తదితరులు పాల్గొన్నారు.

## కాకవేడు గంగజాతర

నగరి, జూన్ 7 ప్రభాతవార్త:



నగరి మున్సిపాలిటీ కాకవేడు గ్రామంలో గంగమ్మజాతర వేడుకల్లో మంత్రి రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆయనతో పాటు వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## మిషన్ రాయలసీమ పేరుతో అభివృద్ధికి కంకణం



నగరి, జూన్ 7 ప్రభాతవార్త:

కడపలో రాయలసీమ డిక్లరేషన్ ప్రకటన సందర్భంగా నగరి టీడీపీ నాయకులతో కలిసి నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. యువగళం పాదయాత్ర సందర్భంగా రాయల సీమలో రైతులు, ప్రజలు పడుతున్న కష్టాలను చూసి చలించిపోయిన లోకేష్ రాయలసీమ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా మిషన్ రాయలసీమపేరుతో కంకణం కట్టుకున్నారన్నారు. 2019లో అధికార మార్పుతో ఇరిగేషన్ ప్రాజెక్టులు ఆపేయడంతో రైతులు సాగునీరు దొరకక పంటలు ఎండిపోతున్నాయన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆగిపోయిన ప్రాజెక్టులు పూర్తిచేసి సాగునీరందిస్తామని తెలిపారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ ఇస్తాం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరక పక్క రాష్ట్రాలకు వలసలు పోతుండడంతో వాటిని ఆపడానికి పక్కా ప్రణాళికను రచిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు జీవరత్నంనాయుడు, విజయపురం మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబు యాదవ్, తుడా మాజీ డైరెక్టర్ ధనంజయలునాయుడు, నగరి బీసీసెల్ ప్రధాన కార్యదర్శి కరుణ, టీడీపీ నాయకులు ప్రకాష్, అంకయ్య, మునిశేఖర్, హను, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన వేసవి శిబిరం

రేణిగుంట, జూన్ 7 ప్రభాతవార్త:



రేణిగుంట గ్రంథాలయం నిర్వహించిన వేసవి శిబిరం బుధవారంఘనంగా ముగిసింది. గత నెల రోజులుగా ఈ శిబిరం జరుగుతున్నది. ప్రతిరజు శిబిరంలో పాల్గొన్న పిల్లలకు వివిధ రకాల విషయాలపై పలువురు ప్రముఖులు అవగాహన కల్పించారు. ముఖ్యంగా వైజ్ఞానిక, విద్య, లలిత కళలు, సాంస్కృతిక కార్యక్రమాలపై తర్ఫీదునిచ్చారు. పిల్లలను చైతన్యపరచడానికి శిబిరం వేదికగా మారింది. శిబిరం నిర్వహించడానికి లైబ్రరీ అధికారిణి శ్రీముఖి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. సీపీఎం నాయకులు రమణ తమ పూర్తి సహాయ సహకారాలు అందజేశారు. ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో పలువురు విద్యార్థులు వివిధ కళారూపాలను ప్రదర్శించారు. ఎంపీడీవో హరిబాబు, గౌరవాధ్యక్షులు టెంకాయలు దామోదరం, అధ్యక్షులు నారాయణ,ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి రాజు, ఆషా, జూలియన్‌రాజు, వైస్ ఎంపీపీ రాజేశ్వరి, లైబ్రరియన్ శ్రీముఖి, సెల్వరాజు, నరసింహారెడ్డి, తదితరులు తల్లిదండ్రులు సమక్షంలో పోటీల్లో గెలుపొందిన హాజీరా, గౌతమ్, రిజ్వాన్, ప్రణతిక, జగత్లకు బహుమతులు అందజేశారు.

## సంకల్పవరసిద్ధి వినాయకుని ఆలయంలో పూజలు

తిరుపతి,జూన్ 7ప్రభాతవార్త:



వినాయకసాగర్‌లోని సంకల్ప వరసిద్ధివినాయక స్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం సంకటహరచతుర్ధశి పూజలు శాస్త్రోక్తంగా జరిపించారు. బుధవారం సంకటహరచదుర్ధశి రావడంతో వినాయక నిమజ్జన కమిటీ సభ్యులు గుండాల గోపీనాధరెడ్డి, చంగారెడ్డి, డిపి ఆనంద్,కె. సుబ్రమణ్యంరెడ్డి, విజయకుమా ర్‌రెడ్డి వినాయకునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

## శివయ్యసేవలో ఐఎఫ్‌ఎస్ అధికారి

శ్రీకాళహస్తి,జూన్ 7 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం ఐఎఫ్‌ఎస్ అధికారి ఎన్.నాగేశ్వరరావు కుటుంబ సమేతంగా వచ్చారు.వారికి దక్షిణ గోపురం వద్దఆలయ మర్యాదలతో వేదపండితులతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారికి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వారికి స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు.ఏర్పాట్లను ఎఇఓ సతీష్‌మాలిక్, టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శనం, పిఆర్ఓ నాగభూషణం నాయక్‌లు పర్యవేక్షించారు.

## పోలేరమ్మను దర్శించుకున్న బొజ్జల బృందమ్మ

తొట్టంబేడు, జూన్ 7 ప్రభాతవార్త :



తొట్టంబేడు గ్రామంలో బుధవారం నిర్వహించిన పోలేరమ్మ అమ్మవారిని బొజ్జల బృందమ్మ దర్శించుకున్నారు. ఆమెకు మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు, నాయకులు చిల్లకూరు బాలసుబ్రమణ్యం(మణి), బీమాల భాస్కర్‌ల ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం ఆమె అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆమెకు తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో మాజీ పాలసరఫరా ఛైర్మన్ రావిళ్ళ మునిరాజనాయుడు, మాజీ మార్కెట్‌కమిటీ ఛైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు, డాక్టర్ ఉమేష్‌రావు, మల్లీశ్వరి, రాష్ట్ర సాంస్కృతిక కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు.సుబ్రమణ్యం, తెలుగుయువత పట్టణ ఉపాధ్యక్షుడు వంకాయల సిద్దులయ్య, తొట్టంబేడు గ్రామ తెలుగుదేశంపార్టీ నాయకులు చిల్లకూరు వెంకటేష్, అయ్యప్ప, నాగరాజు, పి.సుబ్రమణ్యం, భార్గవకుమార్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ప్రశాంత వాతావరణంలో గ్రూప్ 1 పరీక్షల నిర్వహణ

-జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి
తిరుపతి కలెక్టరేట్, జూన్ 7 ప్రభాతవార్త :



ఈ నెల 3వ తేదీ నుండి జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషనర్ గ్రూప్ 1 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నట్లు జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎస్‌వియు కాలేజీ ఆఫ్ ఆర్ట్స్‌లో నేడు పరీక్షల నిర్వహణ పై పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ గ్రూప్ 1 పరీక్షలు జూన్ 3వ తేదీ నుండి 10వ తేదీ వరకు జరగనున్నాయని ఆదివారం మినహా ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహణ ఉంటుందని తెలిపారు. ఈ పరీక్షలకు అభ్యర్థులు మొత్తం 577 మంది హాజరు కావాల్సి వుండగా వుండగా, ఈ నెల తేదీ 3న 439, 5న 434, నేడు అభ్యర్థులు 429 మంది హాజరయ్యారని అన్ని శాఖల సమన్వయంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ పర్యటనలో ఎస్‌డిసి శ్రీనివాసులు, పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ సుమకిరణ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మణి ఉన్నార

## గంగమ్మ తల్లికి పసుపు కుంకుమ పట్టు సారె వితరణ

నారాయణవనం, జూన్ 7 ప్రభాతవార్త :



బత్తలవారికండ్రిగ(సిటిర్‌నత్తం)లో గత రెండురోజులుగా గంగజాతర అంగరంగ వైభవంగా జరుగుతున్నది. ఉత్సవాల్లో భాగంగా బత్తవారికండ్రిగ మాజీ సర్పంచ్ సొరకాయల స్వామి(తాతయ్య) గంగమ్మతల్లి అమ్మవారికి ఆనవాయితీ అందజేసే పసుపు, కుంకుమ, పట్టుసారెను అందజేశారు. మాజీ సర్పంచ్ ఇంటి నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యా లు, బాణసంచా వేడుకల నడుమ ఊరేగింపుగా వెళ్లి అందజేశారు. గత కొన్నేళ్లుగా గంగమ్మ తల్లికి అందజేస్తున్నట్టు మాజీ సర్పంచ్ తెలిపారు.

## పద్మాశాలీ వంశస్తుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం

నారాయణవనం, జూన్ 7 ప్రభాతవార్త :

కల్యాణ వేంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు బుధవారం జరిగిన రథోత్సవం, కల్యాణోత్సవం సందర్భంగా జిల్లా పద్మాశాలీ వంశస్తుల ఆధ్వర్యంలో మధ్యాహ్నం వేలాదిమంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. అలాగే బుధవారం రాత్రి జరిగిన కల్యాణోత్సవం సందర్భ ంగా పట్టుసారెను ఎగువ పదా ్మశాలీవీధిలోని భద్రావతీ సమేత భావనారుషి ఆలయం నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భాణాసంచావేడుకల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి టిటిడి అధికారులకు అందించారు.

## కల్యాణవేంకటేశ్వరుని కల్యాణోత్సవానికి పట్టుసారే వితరణ

నారాయణవనం, జూన్ 7 ప్రభాతవార్త :

నారాయణవనంలో ప్రసిద్ది చెందిన టిటిడి ఆలయం పద్మావతీదేవి సమేత కల్యాణవేంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్స వాల్లో భాగంగా ఎనిమిదవ రోజు బుధవారం రాత్రి 8గంటలకు జరిగిన కల్యాణోత్సవానికి సంబంధించి నారాయణవనం పట్టుశాలి కులస్తులు పట్టుసారేను ఊరేగింపుగా తీసుకెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీవంశస్తులు ఆర్టీసి పెరుమాల్, ఎస్.ఎస్.గిరిబాబు, తిరుమల శ్రీనివాసులు, ఎ.హరి, శంకర్, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

## నింద్ర వ్యవసాయాధికారిగా తులసిరామ్

నింద్ర,జూన్7 ప్రభాతవార్త :



నింద్ర మండల వ్యవసాయాధికారిగా తులసిరామ్ బుదవారం పదవీ భాధ్యతలు స్వీకరించినారు.గతంలో వ్యవసాయాధికారిగా పనిచేస్తా వుండిన మురళీక్రిష్ణ బదిలీపై కెవిపురం మండలానికి వెళ్ళిపోగా, ఆయన స్థానంలో నూతనంగా కడప నుంచి బదిలీపై వచ్చిన తులసిరామ్ పదవీ భాధ్యతలు చేపట్టినారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూరైతులకు అందుబాటులో వుండి వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

## గంగమ్మతల్లికి మొక్కులు తీర్చుకున్న భానుప్రకాష్

వడమాలపేట, జూన్ 7 ప్రభాతవార్త:



వడమాలపేట మండలం వడమాల గంగమ్మజాతర మహోత్సవంలో నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం ఉదయం వడమాల గ్రామానికి చేరుకున్న భానుప్రకాష్ అమ్మవారికి సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధనంజయలునాయుడు, ఉమాపతి, శివ, కుమార్, చైతన్య, వినోద్, పెద్దబ్బ రాజు, వెంకటేశ్వరరావు, వెంకటయ్య, శివరాయులు, మురళి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సంకటహర చతుర్థి

పుత్తూరురూరల్, జూన్ 7 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని బెస్తవీధిలో వెలసి ఉన్న శ్రీ తరుణ గణపతి ఆలయంలో బుధవారం సంకటహర చతుర్థి సందర్భంగా విశేష పూజలు చేశారు. అనంతరం కలశంలోని జలాన్ని స్వామివారికి అభిషేకం చేశారు. అలాగే ప్రత్యేక పుష్పాలంకరణ చేసి పూజలుచేశారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

## వైభవంగా గంగ జాతర

పుత్తూరురూరల్, జూన్ 7 ప్రభాతవార్త:

పుత్తూరు మున్సిపల్ పరిధిలోని సీటీఆర్ నత్తం కాలనీలో బుధవారం వైభవంగా గంగజాతర కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి అమ్మవారిని బంకమట్టితో తయారు చేసి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి విద్యుత్ దీపాలంకరణతో పురవీధుల్లో డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. సాయంత్రం ఆలయం వద్ద భక్తుల తాకిడి అధికమైంది. అలాగే కుంభాలు వేసి పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం నిమజ్జనం కార్యక్రమం చేపట్టారు.

## 75 ఏళ్ల నిరీక్షణ వేళ శెట్టిపల్లి భూముల సమస్య పరిష్కారం పై సమీక్ష

తిరుపతి కలెక్టరేట్, జూన్ 7 ప్రభాతవార్త :



75 ఏళ్ల నిరీక్షణ ఫలిస్తున్న వేళ శెట్టిపల్లి భూముల సమస్య పరిష్కారంపై జాయింట్ కలెక్టర్ బాలాజీతో డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి దశలో భూముల సర్వే ప్రారంభించాలని, సంబంధిత అధికారులను వెంటనే నియమించి సర్వే చేయించి మున్సిపల్ కార్పొరేషన్‌కు అప్పగించాలని చర్చించడం జరిగింది. ఈ సమావేశంలో జేసి బాలాజీ, ఆర్డివో కనకనరసా రెడ్డి, ఎంఆర్ఓ వెంకటరమణ, కార్పొరేటర్ రామస్వామి, వెంకటేశ్వర్లు, డిటి అశోక్, కందారపు మురళి, సప్తగిరి రాజా తదితరులు పాల్గొన్నారు.

## నారా లోకేష్ స్పష్టమైన హామీ ఇవ్వాలి

-రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్ కుమార్ రెడ్డి
తిరుపతి కలెక్టరేట్ జూన్ 7, ప్రభాతవార్త

రాయలసీమ డిక్లరేషన్‌లో సీమ నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, విద్యార్థిని విద్యార్థులకు కాలేజీల సీట్ల కేటాయింపు, రైతాంగానికి సాగు నీటి ప్రాజెక్టుల విషయంలో నారా లోకేష్ స్పష్టమైన హామీ ఇవ్వాలని రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రాయలసీమ అభివృద్ధి మండలిని ఏర్పాటు చేసి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు.

## ఎక్జిక్యూటివ్ ఇంజనీర్‌కు సన్మానం

తిరుపతి ప్రెస్‌క్లబ్,జూన్ 7 ప్రభాతవార్త:



తిరుపతి ఓఎంసి సర్కిల్ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన కె.శ్రీనివాస్‌ను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం జి 3045 రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సుధాకర్ పుష్పగుచ్ఛం,దుశ్శాలువతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం.ప్రహ్లాదయ్య, జిల్లా జనరల్ సెక్రటరీ దివాకర్‌రెడ్డి,తిరుపతి అధ్యక్షుడు రామనాథం,జిల్లా ముఖ్య నాయకులు ఎజి.ఉదయ్‌కుమార్, హేమాద్రికుమార్, రాజేష్, భాను, లోకేష్,ఎస్ఈ ఆఫీస్ సభ్యులు పూర్ణకుమార్,చిన్నరాయుడు,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మొదటి స్థానం

తిరుపతి(విద్య), జూన్ 7 ప్రభాతవార్త :

టిఓసిఐసి భారతదేశంలోని 10 ఇన్నోవేషన్ సెంటర్‌లో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మొదటి స్థానంలో నిలిచిందని శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాజా రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిఓసిఐసి ప్రిసమ్ అనేది ఆవిష్కర్తలను ప్రోత్సహించడానికి, దేశంలో విజయవంతమైన వ్యవస్థాపకులను సృష్టించడానికి డిఎస్ఐఆర్ యొక్క పథకం ఆంధ్రప్రదేశ్, దక్షిణ భారతదేశంలోని ఇతర ప్రాంతాలలో ఆవిష్కరణ సంస్కృతి, వ్యవస్థాపకతను ప్రోత్సాహించడంలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం టిఓసిఐసి వారి గణనీయమైన కృషికి డిఎస్ఐఆర్‌లోని అధికారులు ప్రశంసించారు. ఈ విజయాన్ని దృష్టిలో ఉంచుకుని వైస్ చాన్సలర్ రాజా రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని భారతదేశంలో విశ్వవిద్యాలయ కేంద్రాన్ని మొదటి స్థానంలో ఉంచడంలో కృషి చేసిన కోఆర్డినేటర్ , ప్రొఫెసర్ పి. ఉమా మహేశ్వర్, కోఆర్డినేటర్ ప్రొఫెసర్ జ్యోత్స్నను అభినందించారు.

# అధికారులకు... ప్రజాప్రతినిధులు గుర్తున్నామా?

-సర్వసభ్య సమావేశంలో నిలదీసిన ప్రజాప్రతినిధులు
-1.60కోట్లుతో రాజీవ్‌నగర్ జగనన్న లేఅవుట్‌లో శాశ్వత నీటి పథకం

**తొట్టంబేడు, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :**
మండంలో ఎక్కడైనా అధికారులు కార్యక్రమం చేపట్టినా సంబంధిత అధికారులు ఆయా పంచాయతీల పరిధిలో ఉన్న సర్పంచ్‌లు, ఎంపిటిసిలకు కనీసం సమాచారం అందించడం లేదు. అసలు మేము ఉన్నామని గుర్తించరా? అంటూ పలువురు సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు మండలస్థాయి అధికారులను నిలదీశారు. బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంను ఎంపిపి ఉన్నం నిర్మల వాసుదేవనాయుడు అధ్యక్షత వహించగా, వైస్ ఎంపిపిలు కన్నలిమల్లిక, గెరటారెడ్డి, కో ఆప్షన్ సభ్యులు ప్రేమ్‌కుమార్, వైకాపా సీనియర్ నాయకులు ఉన్నం వాసుదేవ నాయుడు, ఎంపిడిఓ తరుణాక్షరెడ్డిలు హజరయ్యారు. ఈసందర్భంగా సమావేశాన్ని తొలుత ఆర్‌డబ్యుఎస్ ఎఈఈ మమతబాయితో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు అన్ని చర్యలుతీసుకుంటున్నామని మండలంలో మొత్తం 346 చేతిబోర్లు ఉండగా ప్రస్తుతం 328చేతిబోర్లు పనిచేస్తున్నాయన్నారు. ఇక సమీపంలో ఉన్న రాజీవ్‌నగర్‌లో శాశ్వత నీటి సదుపాయానికి రూ.1.60 కోట్లతో జల్‌జీవన్ మిషన్ పథకం కింద పనులు చేపట్టనున్నట్లు వివరించారు. కొత్తగా 9 గ్రామాల్లో ఓవర్‌హెడ్‌ట్యాంకునిర్మాణాలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రతి గ్రామంలో స్మశానం వద్ద



చేతిబోరు ఏర్పాటు చేయాలని అందరు ప్రజాప్రతినిధులు ముక్తకంఠంతో పేర్కొనడంతో దీనిపై ఎంఎల్‌ఏకు తెలిపి అనుమతి ఇచ్చిన తర్వాత పనులు చేపట్టాలని వైకాకా నాయకుడు ఉన్నంవాసుదేవనాయుడు తెలిపారు. పొయ్య పంచాయతీలో ఉన్న రెండు బోర్లను హైవే పనులు చేపడుతున్న మెగా కంపెనీ తొలగించారని దీనిపై చర్యలుతీసుకోవాలని లేదంటే గ్రామస్తులందరు ధర్నాకు సిద్దంగా ఉన్నామని ఎంపిపి వివరించారు. రీ సర్వే డిటి వసంతరావు మాట్లాడుతూ గ్రామాల్లో జగనన్న భూసంరక్షణ పథకం కింద 8 గ్రామాల్లో రీసర్వే ప్రారంభమైందని దీంతో అన్నదాతలకు ఉన్న భూముల్లో పక్కాగా సర్వే జరుగుతుందన్నారు. మండలంలో హౌసింగ్ పథకం కింద నిర్మిస్తున్న ఇళ్ళకు బిల్లులు ఎప్పటికప్పుడు పడుతున్నాయని ఎఈ సుబ్రమణ్యం తెలిపారు. అయితే ఇటీవల ఎంఎల్‌ఏ గడపగడపకు కొత్తకండ్రిగ(పికె) గ్రామంలో పర్యటించినపుడు ఎఈఈ అబద్దాలు చెప్పారని ప్రజాప్రతినిధులు నిలదీశారు. బిల్లులు పెట్టేందుకు కూడా ముందుకు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి మాట్లాడుతూ జనుములు, జీలగలు, పిల్లిపెసలు అన్నదాతలకు 50శాతం సబ్సిడీతో ఇస్తున్నామని తెలిపారు. అయితే దీనిపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు చెప్పకుండా ఎలా పంపిణీచేస్తారని మీరే పంపిణీచేస్తే ఇక తామెందుకున్నట్లు అసంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యుత్ ఎఈఈ బాలాజీ గత ఆరు నెలలుగా విద్యుత్ స్తంభాలు కావాలని చెబుతున్నా పట్టించుకోవడం లేదని సాయిబాబా గుడిసమీపంలో రాత్రి వేళల్లో విద్యుత్‌కోతలు ఎక్కువగా ఉన్నాయని దీనిపై స్పందించాల్సిన ఉన్నతాధికారులకు పోన్‌చేయగా ఆయన సమాధానం సరిగ్గా చెప్పడం లేదని దీనిపై రూరల్ ఇఇ వాసుదేవరెడ్డికి పిర్యాదు చేస్తామన్నారు. ఎంఈవో భారతీ మాట్లాడుతూ ఈకొత్త విద్యాసంవత్సరానికి పాఠ్యపుస్తకాలు, జెవికె కిట్లు వచ్చాయని అందరికీ పంపిణీచేస్తామన్నారు. ఇకపై తమకు చెప్పకుండా ప్రభుత్వ కార్యక్రమాలు చేస్తే సహించది లేదని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు, కార్యాలయ సూపరింటెండెంట్ మధుసూధన్, సీనియర్ అసిస్టెంట్ జనార్ధన్, జూనియర్ అసిస్టెంట్ వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్ : ఎమ్మెల్యే

**నాయుడుపేట, జూన్ 7 ప్రభాతవార్త :**



రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో సుపరిపాలన సాగుతోందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. బుధవారం నాయుడుపేటలోని విన్నమాల సచివాలయం పరిధిలోని పెరికిలింపాటికండ్రిగ, కమ్మవారిపాలెం గ్రామాల్లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, సర్పంచ్ వాకాటి సోమశేఖర్, ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, కటకం జయరామయ్య, ఒట్టూరు కిషోర్ యాదవ్, బైనా మల్లికార్జునరెడ్డి, పేట చంద్రారెడ్డి, రాహుల్, చదలవాడ కుమార్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## కాణిపాకంలో వైభవంగా సంకటహార గణపతివ్రతం

**కాణిపాకం, జూన్ 7 ప్రభాతవార్త:**



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో బుధవారం సంకటహార గణపతివ్రతంను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతినెలా పౌర్ణమి అనంతరం సంకష్టహర చతుర్థి రోజున ఈవ్రతంను నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు దేవస్థానం ఆస్థాన మండపంలో అర్చకులు ఈ వ్రతాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయం నుండి సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆస్థాన మండపంకు తీసుకువచ్చి వుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకులు వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు, సాయంత్రం 5 గంటలకు రెండు దఫాలుగా ఈవ్రతాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదములను అందజేశారు. సంకటహార చతుర్థి వ్రతం నిర్వహించుకోవడానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలిరావడంతో ఆస్థాన మండపం కిక్కిరిసింది. దీనితో ఆలయ అధికారులు, సిబ్బంది భక్తులకు కావలసిన ఏర్పాట్లు చేపట్టారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు, అర్చకులు, వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలపై సమగ్ర అవగాహన ఉండాలి : కమిషనర్

**తిరుపతి కార్పొరేషన్, జూన్ 7 ప్రభాతవార్త :**



మెప్మా కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంపొందించడానికి రిసోర్స్ పర్సన్ కోసం ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి దిశానిర్దేశంలో పట్టణ పేదరిక నిర్మూలన కొరకు మెప్మా సంస్థ కృషి చేస్తున్నదన్నారు. పట్టణ పేదలతో స్వయం సహాయక సంఘాలను ఏర్పరిచి, సుస్థిర జీవనోపాదులను మహిళలకు కల్పించి తద్వారా సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నదన్నారు. పట్టణ పేదలతో స్వయం సహాయక సంఘాలను ఏర్పరిచి, సుస్థిర జీవనోపాధులను మహిళలకు కల్పించి తద్వారా సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్న మెప్మా సభ్యులందరికి ఈ శిక్షణా శిబిరం ఎంతో ఉపయోగకరమన్నారు. మెప్మా పిడి రాధమ్మ మాట్లాడుతూ ప్రారంభమైన శిక్షణా శిబిరంలో 50 మంది ఆర్పిలు పాల్గొన్నారని, తిరుపతి, చిత్తూరు జిల్లాలోని ఆర్పిలకందరికి నెల రోజుల పాటు రెండు రోజులకి ఇక బ్యాచ్‌లో 50 మంది చొప్పున శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు విజయ్ భాస్కర్, శ్రీరాములు, సిఎంఎం కృష్ణవేణి, సంఘాల అధ్యక్షురాలు ప్రతిమా రెడ్డి పాల్గొన్నారు.

## వరల్డ్ బ్యాంక్ ప్రతినిధితో సమావేశం

**తిరుపతి కార్పొరేషన్, జూన్ 7 ప్రభాతవార్త :**



తిరుపతి నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో బుధవారం వరల్డ్ బ్యాంక్ ప్రతినిధి విజయశేఖర్‌తో కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. నగర పాలక సంస్థలకు, మున్సిపాలిటీలకు ఆర్థిక వనరులు సమకూర్చుటకు అవసరమైన ఫైనాన్స్ అందించేందుకు తమ వరల్డ్ బ్యాంక్ చేయూత నిస్తుందని, ప్రపంచ బ్యాంకు ప్రతినిధి విజయ్ భాస్కర్ తెలపడం జరిగింది. చేపట్టబోయే ప్రాజెక్టుల విలువ, వాటి ఆవశ్యకత, వాటి ద్వారా నిధులు తిరిగి ఎలా వస్తాయి అనే విషయాలను తెలుసుకుని తమ సంస్థ చర్చించి నిధులు ఫైనాన్స్ ఇచ్చేందుకు ఒక నిర్ణయం తీసుకుంటుందని ఆయన చెప్పడం జరిగింది. కమిషనర్ హరిత, డిప్యూటి మేయర్ భూమన అభినయ్ మాట్లాడుతూ తిరుపతి నగరాభివృద్ధికి, ప్రజా అవసరాల కోసం నగరంలో చేపట్టిన ప్రాజెక్టులు పూర్తి అయితే కార్పొరేషన్‌కి ఆదాయ వనరులు పెరుగుతాయన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్డు రావడం వలన ఆయా ప్రాంతాల్లో ఇళ్ళులు, అపార్ట్మెంట్లు, కార్యాలయాలు, షాపులు రావడం వలన పన్నులు రూపంలో నగర పాలక సంస్థకు ఆదాయాలు సమకూర్తుందన్నారు. మల్టి లెవెల్ కార్ పార్కింగులు పూర్తి అయితే కూడా ఆదాయం వస్తుందన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామి రెడ్డి, డిఈలు విజయకుమార్ రెడ్డి, సంజీవ్ కుమార్, గోమతి, దేవిక, మహేష్, రెవెన్యూ అధికారి కెఎల్ వర్మ, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

## సబ్సిడీ వేరుశెనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి..!

-వైసిపి ఎంఎల్ఏ అభ్యర్ధి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

**చంద్రగిరి, జూన్ 7 ప్రభాతవార్త:**



ప్రభుత్వం సబ్సిడీపై అంది స్తున్న వేరుశెనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకో వాలని వైసిపి ఎంఎల్ఏ అభ్య ర్ధి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిష త్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఆయన రైతులకు వేరుశెనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయం చేయడంలోని రైతుల కష్టాలను గుర్తెరిగి క్రమం తప్పకుండా రైతు భరోసా అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా సబ్సిడీపై రైతులకు ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు, ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి, జడ్పీటిసి చిల్లకూరి యుగంధర్ రెడ్డి, ఎంపిటిసి బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, రామిరెడ్డిపల్లి సర్పంచ్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మస్తాన్, ఎంపిడిఓ రమేష్‌బాబు, నాయకులు చేగు గోవర్ధన్ గుప్తా, మించల ప్రవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్ 1 ప్రధాన పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ పోలీస్ బందోబస్తు

144 సెక్షన్ అమలు ,తిరుపతి జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి

**తిరుపతి క్రైం, జూన్ 7, ప్రభాతవార్త**



శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ ప్రకాశం భవన్ పరీక్షా కేంద్రం నందు గ్రూప్ 1 ప్రధాన పరీక్షలు వ్రాయుటకు పలు జిల్లాలకు సంబంధించిన మొత్తం 577 అభ్యర్థులకు గాను 429 అభ్యర్థులు హాజరు కాగా 148 అభ్యర్థులు గైర్హాజరు అయ్యారు. ఈ కేంద్రంలో పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో భద్రతపరమైన అంశాలపై పరిశీలించి, దానికనుగుణంగా విధి నిర్వహణలో ఉన్న పోలీస్, విద్యా శాఖ అధికారులకు భద్రతా పరమైన అంశాలపై పలు సూచనలు చేశారు. అలాగే పరీక్ష కేంద్రం వద్ద పటిష్టమైన పోలీస్ భద్రత ఏర్పాటు చేసినట్లు తిరుపతి జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతిలో పలు జిల్లాలకు కలిపి పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. పరీక్షల కేంద్రాల వద్ద అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. అన్ని పరీక్ష కేంద్రాలలో అభ్యర్థులు పరీక్షలకు వెళ్లే ముందు వారిని పూర్తిగా తనిఖీ చేసి అనుమతించడం జరిగిందని అన్నారు. ఎలాంటి మొబైల్స్, ఎలక్ట్రానిక్ వస్తువులను అభ్యర్థులు, ఇన్విజిలేటర్స్, పరీక్ష కేంద్రం లోపల విధులు నిర్వర్తించే ఇతర అన్ని శాఖల సిబ్బంది, అధికారుల వద్ద కూడా ఉంచుకోకుండా తగిన జాగ్రత్త తీసుకున్నామని తెలియజేసారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ పరీక్షలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో అనుమానిత వ్యక్తులపై నిఘా పెంచడం జరిగిందన్నారు. విద్యా శాఖ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. పరీక్ష జరుగు సమయంలో పరీక్షా కేంద్రాల దగ్గరలో జిరాక్స్ సెంటర్లు, ప్రింటింగ్ సెంటర్లు, సెల్ ఫోన్‌షాపులు మరియు ఎలక్ట్రానిక్స్ సంబంధపడిన షాప్స్ మూసి వేయించామన్నారు.

## రాయలసీమ అభివృద్ధికి కంకణం కట్టుకున్న లోకేష్

గాలి భానుప్రకాశ్



**పుత్తూరు, జూన్ 6 ప్రభాతవార్త :**
యువగళం పాదయాత్రలో రాయలసీమ రైతులు, ప్రజల కష్టాలు చూసి చలించిపోయిన నారా లోకేష్ మిషన్ రాయలసీమ పేరిట రాయలసీమ అభివృద్ధికి కంకణం కట్టుకున్నారని తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాశ్ అన్నారు. కడప జిల్లాలో రాయలసీమ డిక్లరేషన్ ప్రకటన కార్యక్రమానికి బుధవారం నగరి నియోజకవర్గ పార్టీ శ్రేణులతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2019 అధికారం మార్పుతో ఇరిగేషన్ ప్రాజెక్టులు నిలిపివేయడంతో రైతులకు సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆగిపోయిన ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందిస్తామని తెలిపారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందిస్తామన్నారు. వ్యవసాయ రంగంతో పాటు పాడి పరిశ్రమ అభివృద్ధి చేసి చూపిస్తామని తెలిపారు. ఉద్యోగం, ఉపాధి లేక జరుగుతున్న వలసలను ఆపడానికి పక్కా ప్రణాళికలు రచిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పుత్తూరు పట్టణాధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, విజయపురం మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, నాయకులు ధనంజయులునాయుడు, కరుణ యాదవ్, ప్రకాశ్, అంకయ్య, హను, మునిశేఖర్, గజేంద్ర, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అన్ని ఖాళీలు ప్రదర్శించి బదిలీ కౌన్సెలింగ్

- డిఇఓ కార్యాలయం ఎదుట ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా



**చిత్తూరు, జూన్ 7 ప్రభాతవార్త:**
ఉపాధ్యాయ బదిలీ కౌన్సెలింగ్‌లో ఖాళీగా వున్న ఉపాధ్యాయ పోస్టులు మొత్తం ప్రదర్శించి ఆపై టీచర్లకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. టీచర్ల బదిలీ కౌన్సెలింగ్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఖాళీలను బ్లాక్ చేయడాన్ని నిరసిస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం డిఇఓ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు మెరుపు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ జిఓనెం.117ను సవరించకుండా వేలాది టీచర్ పోస్టులు రద్దు అయ్యేవిధంగా చేపడుతున్న టీచర్ల బదిలీ కౌన్సెలింగ్ విద్యా రంగానికి తీవ్ర నష్టం కలుగజేస్తోందని దుమ్మెత్తిపోశారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా టీచర్ ఖాళీ పోస్టులను బ్లాక్ చేయడం అన్యాయమన్నారు. దీంతో సీనియర్ టీచర్లు తీవ్ర అన్యాయానికి గురవుతారన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య పెరిగి బోధనపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఖాళీలు బ్లాక్ చేయడం వల్ల బదిలీలకు సార్థకత లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బదిలీ కౌన్సెలింగ్‌లో వీలైనన్ని ఎక్కువ ఖాళీలు ప్రదర్శిస్తామని మొన్నటి వరకు హామీ ఇచ్చిన అధికారులు ప్రస్తుతం అందుకు విరుద్ధంగా ప్రవర్తించడం అన్యాయమన్నారు. రోజుకు ఒక జిఓ, పూటకు ఒక సవరణ పేరిట ఉపాధ్యాయులను గంగరగోళంకు గురిచేస్తున్నారని నాయకులు ధ్వజమెత్తారు. జిఓనెం.117 యధావిధంగా అమలు చేస్తే నిరుద్యోగులు, విద్యార్థులు, పాఠశాలలకు కోలుకోలేని నష్టం వాటిల్లుతుందని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు టీచర్లు బదిలీ కౌన్సెలింగ్‌లో అన్ని ఖాళీలను ప్రదర్శించి షెడ్యూల్‌ను మరో రెండు రోజుల పాటు పొడగించాలని డిమాండ్ చేశారు. పదవి విరమణకు దగ్గరగా వున్న ఉపాధ్యాయులను తప్పనిసరి బదిలీల పేరిట ఇబ్బంది పెట్టడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు రమేష్, దేవరాజులురెడ్డి, జివి రమణ, ముక్తార్‌అహ్మద్, గంటామోహన్, మదన్మోహన్‌రెడ్డి, గణపతి, రమేష్, రెడ్డప్పనాయుడు,జగదీష్, పరంధామ, కమలాపతి, సురేష్, ప్రభావతి, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించండి : కమిషనర్

**తిరుపతి కార్పొరేషన్, జూన్ 7 ప్రభాతవార్త :**
నగరంలోని ప్రతి కూడలి, డివైడర్లలో చెత్త తొలగించి పూల మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దాలని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం నగరంలోని 3,12,13,14 వార్డుల్లో గల లక్ష్మీపురం కూడలి, జయనగర్, గుర్రం జాషువా మార్గం, న్యూ ఇందిరానగర్, ఎస్‌జీఎస్ కాలేజ్ రోడ్డు, రాఘవేంద్ర నగర్, ఎయిర్ బైపాస్ రోడ్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు, రోడ్లును డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు ఎస్‌కె బాబు, ఆంజనేయులు, నగర పాలక సంస్థ అధికారులతో కలిసి పరిశీలించారు. లక్ష్మీపురం కూడలి అపరిశుభ్రంగా ఉండడంతో వెంటనే శుభ్రం వేసి పూల మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే నగరంలోని అన్ని కూడల్లో సుందరీకరణ చేయాలన్నారు. జయనగర్, న్యూ ఇందిరా నగర్ ప్రాంతాల్లో ఇంటి వద్దకు వెళ్ళి చెత్త వాహనాలు ఎన్ని గంటలకు వస్తున్నాయి, వీధులు తరచూ శుభ్రం చేస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ప్రతి ఇంటి వద్ద తడి, పొడి చెత్త వేర్వేరుగా స్వీకరించాలని ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హరికృష్ణ, డిసిపి శ్రీనివాసులు, ఏసిపి బాలసుబ్రమణ్యం, డిఈ సంజయ్ కుమార్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య , సుమతి తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల కట్టడికి పక్కాగ చర్యలు



– కమీషనర్ డాక్టర్ జె.అరుణ

**చిత్తూరు, జూన్ 7 ప్రభాతవార్త:**
చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సీజనల్ వ్యాధుల కట్టడికి పక్కా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా మలేరియా విభాగం అధికారులతో కలిసి కమీషనర్ డాక్టర్ జె.అరుణ బుధవారం వార్డు పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ డాక్టర్ జె.అరుణ మాట్లాడుతూ రానున్నది వర్షాకాలం కావడంతో క్షేత్ర స్థాయిలో దోమల కట్టడికి పక్కా ప్రణాళిక రూపొందించాలన్నారు. డ్రైనేజీ కాలువల్లో పూడిక తీత కార్యక్రమం వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే నీటి నిల్వ ప్రాంతాలు గుర్తించి అక్కడ దోమల వ్యాప్తి జరుగకుండా వుండేలా పక్కా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ దోమల కట్టడికి ఫాగింగ్ కార్యక్రమం విస్తృతంగా చేపట్టాలన్నారు. ఫాగించి కార్యక్రమం ఎలా నిర్వహించాలనే విషయంపై వార్డు పర్యావరణ, పారిశుధ్య కార్మికులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ డాక్టర్ పీరుసాహెబ్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

## రెండేళ్ళలో మహారాష్ట్రలో...గోవిందుని ఆలయం

–శాస్త్రోక్తంగా ముగిసిన భూమిపూజ

**తిరుమల,జూన్ 7ప్రభాతవార్తప్రతినిధి:**



10 ఎకరాల విశాలమైన స్థలంలో వందకోట్ల రూపాయల వ్యయంతో తిరుమల వెంకన్న ఆలయం తరహాలో వాణిజ్యరాజధాని నగరం మహారాష్ట్ర నవీముంబైలో టిటిడి గోవిందుని ఆలయాన్ని రెండేళ్ళలో పూర్తిచేయనుంది. ఈ ఆలయ నిర్మాణానికి బుధవారం ఉదయం శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. మహారాష్ట్రప్రజల చిరకాల కోరిక వీలైనంత త్వరగా నెరవేరనుంది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్‌షిండే, ఉప ముఖ్యమంత్రి దేవేందర్‌ఫడ్నవీస్, రేమాండ్స్ సంస్థ అధినేత గౌతమ్‌సింఘానియా, టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి, టిటిడి బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

## గంగజాతరలో పలువురు అధికారులు

**తొట్టంబేడు, జూన్ 7 ప్రభాతవార్త :**



తొట్టంబేడు మండల కేంద్రంలోని పోలేరమ్మ గంగమ్మ జాతరలో ఏపి పంచాయతీరాజ్ మినిస్టీరియల్ జిల్లా ఎంప్లాయిస్ అసోసియేషన్, మరియు ఎన్జీవో తాలూకా సంఘ అధ్యక్షులు సి.చెంచురత్నం యాదవ్‌తో పాటు జాతీయ వినియోగదారులు హక్కుల కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భరత్‌రెడ్డిలు విచ్చేశారు. వీరికి జాతర నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలో ఉన్న పోలేరమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులుతీర్చుకున్నారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ జాతరలు మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలని ఎంతో భక్తి శ్రద్దలతో జాతరను జరుపుకోవాలన్నారు. ఈఏడాది అన్నదాతలు పంటలు బాగా పండాలని వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రమేష్‌యాదవ్, చందు, పలువురు పాల్గొన్నారు.

## ప్రాణం తీసిన పోకరితనం

**తిరుపతి క్రైం, జూన్ 7, ప్రభాతవార్త**



ఆకతాయి పనులతో ప్రాణం తీసిన పోకిరితనం, ఈస్ట్ సిఐ శివప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి రూరల్ మండలం గ్రామానికి చెందిన మునీ (25) ప్రవీణ్, కన్నయ్య, భార్గవ్, ఆటో తోలుకుంటూ జీవిస్తున్నారు. బుధవారం నలుగురు స్నేహితులు కలిసి మద్యం సేవించారు. అన్నమయ్య సర్కిల్ వద్ద ఆటోలో కూర్చొని వచ్చే పోయే వారిపై దిగుతున్నారు. హని మెస్ యజమాని కుమార్ తన భార్య అనురాధతో కలిసి ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళ్తున్నాడు. అన్నమయ్య సర్కిల్ వద్ద ఈ నలుగురు యువకులు మద్యం మత్తులో కుమార్ భార్యను దూషించారు. ఎందుకు తిడుతున్నారని కుమార్ ప్రశ్నించాడు, నలుగురు యువకులు కుమార్‌పై దాడి చేసి కొట్టారు. విషయం తెలుసుకున్న హనీ మెస్‌లో పని చేస్తున్న సురేష్ కర్రతో నలుగురు యువకులను కొట్టాడు. ఈ నేపథ్యంలో మనీ (25) అనే యువకుడికి తలపైన బలమైన గాయం తగిలింది. స్థానికులు రుయా హాస్పిటల్‌కి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

# అట్టహాసంగా ప్రారంభమైన శ్రీ రేణుకా మాత అమ్మవారి బ్రహ్మోత్సవాలు

**రేణిగుంట, జూన్ 7 ప్రభాతవార్త:**
రేణిగుంట మండలం దిగువ మల్లవరం గ్రామంలో నిండుగా కొలువు దీరిన శ్రీ రేణుకా మాత అమ్మవారికి 61వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం నుంచి ఆదివారం వరకు సాంప్రదాయ బద్దంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డా. మర్దాల రవిబాబు తెలిపారు. బుధవారం కాపు కట్టుట, గెరిగె పూజతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు, గురువారం అమ్మవారి ఊరేగింపు, శ్రీ పోతురాజు కథ, శుక్రవారం తపస్మాన్, వనమహోత్సవం, శనివారం శ్రీ గౌరమ్మ మేడ, శ్రీ గౌరమ్మ కల్యాణం, ఆదివారం అమ్మవారి విశ్వరూప దరశనం, అగ్నిగుండం ప్రవేశం, రాత్రి అమ్మవారి ఊరేగింపుతో



బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. జిల్లాలోజరిగే పెద్ద పెద్ద ఉత్సవాల్లో శ్రీ రేణుకా మాత బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక స్థానం ఉంది. మండలం, జిల్లా, పక్క జిల్లాల నుంచే కాక ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు అమ్మవారి దర్శనానికి తండోపతండాలుగా తరలివస్తారు. బ్రహ్మోత్సవాలకు రాలేని భక్తులు ప్రతి మంగళ, శుక్ర, ఆదివారాల్లో దేవాలయం వద్దకు చేరుకుని అమ్మవారికి పొంగళ్లు పొంగించి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ 60 సంవత్సరాలుగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. కరోనా సమయంలో కూడా బ్రహ్మోత్సవాలను ఏకాంతంగా జరిపించామన్నారు. కార్యక్రమంలో మంద చెంగయ్య, చిన్నయ్య, దేవేంద్ర, చెంగల్రాయుడు, సుబ్రహ్మణ్యం, రమేష్, సుబ్బు, ఇతరులతో పాటు బ్రహ్మోత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.